ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

****

నల్లగొండ

5

బుధవారం 19 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 19.4



భువనగిరి ఖిల్లా

ఉమ్మడి జిల్లా పర్యాటకానికి
రోప్‌వే తోరణం

- రాష్ట్రంలో మొట్టమొదటి రోప్‌వే
- భువనగిరి ఖిల్లాపైకి నిర్మాణానికి రూ.56.81 కోట్లతో టెండర్
- యాదగిరిగుట్ట, నల్లగొండలోని హనుమాన్‌కొండ, నాగార్జునసాగర్ రోప్‌వేలకు ప్రతిపాదనలు

భువనగిరి టౌన్,మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నో చారిత్రక, పురాణ, రాజవంశాల పాలన ఆనవాళ్లతో పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న ఉమ్మడి జిల్లా మరింత పర్యాటక శోభను సంతరించుకోనుంది. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకానికి పెరుగుతున్న ప్రాధాన్యం నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి జిల్లాపై దృష్టిసారించాయి. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ 2.0 పథకానికి ఎంపికైన చారిత్రక భువనగిరి ఖిల్లా అభివృద్ధి, రోప్‌వే నిర్మాణానికి రెండు రోజుల క్రితం పర్యాటకశాఖ రూ.56.81కోట్లతో టెండర్లు పిలిచింది. అలాగే లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సందర్శనకు యాదగిరిగుట్టపైకి, నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌కొండకు, నాగార్జునసాగర్ ఆనకట్ట మీదుగా రోప్‌వే నిర్మాణానికి పర్వతమాల పథకంలో నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇప్పటికే భువనగిరి ఖిల్లాపైకి రోప్‌వే నిర్మాణానికి టెండర్లు పిలవగా మిగతా మూడు ప్రతిపాదనలకు కూడా కేంద్రం ఆమోదం తెలిపితే ఉమ్మడి జిల్లాలో నిర్మించే రోప్‌వేలు రాష్ట్ర పర్యాటకానికి తోరణాలు కానున్నాయి.

ఎట్టకేలకు ఖిల్లా పనులకు టెండర్లు

భువనగిరి ఖిల్లా అభివృద్ధి కోసం పర్యాటకుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరనుంది. ప్రధాని మోదీ 2.0 ప్రభుత్వంలో కేంద్ర పర్యాటకశాఖ క్యాబినెట్ మం త్రి హోదాలో సుమారు నాలుగేళ్ల క్రితం తొలిసారిగా భువనగిరి పర్యటనకు వచ్చిన నేటి ఉక్కుశాఖ మంత్రి నాడు జరిగిన బహిరంగ సభలో భువనగిరి....

- మిగతా 7వ పేజీలో...



ఉద్యమాలే మాకు
ఉగ్గుపాలు

గెరిల్లా శిక్షణ తీసుకొని సాయుధ పోరాటంలో రజాకార్లను గడగడలాడించిన ధీరవనిత.. శత్రువుల కళ్లుగప్పి ఉద్యమాన్ని ముందుకు నడిపిన వ్యూహకర్త.. సొంతంగా పాటలు అల్లి మహిళలను ఉద్యమంవైపు మళ్లించిన చైతన్యదీప్తి.. మహిళా సంఘం నేతగా.. ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజలతో మమేకమై ఉద్యమాలకే జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి మల్లు స్వరాజ్యం. ఆమెకు ముగ్గురు పిల్లలు. కుమారులు మల్లు గౌతంరెడ్డి, మల్లు నాగార్జున్‌రెడ్డి, కుమార్తె పాదూరి కరుణ. ఇద్దరు కుమారులూ కమ్యూనిజం బాటలో పయనిస్తుండగా, ఆమె కోడలు మల్లు లక్ష్మి సైతం అదే బాటను అనుసరించారు. బుధవారం మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా ఆమె పిల్లలను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. స్వరాజ్యం ఉద్యమ గాథలు, ఆమెతో అనుబంధాలను వారు పంచుకున్నారు. • 6లో..



బడ్జెట్ వైపే
అందరి చూపు

- రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం ఉంటుందనే ఆశాభావం
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులపై స్పష్టత వచ్చే అవకాశం
- ఏఎమ్మార్పీ కెనాల్ లైనింగ్, ఏదుల-డిండికి నిధులిస్తారనే చర్చ
- లిఫ్టులు, మూసీకాల్వలకు దండిగా నిధులొస్తాయనే సంకేతాలు
- ఎంజీయూ అభివృద్ధి పనులకు రూ.309కోట్లతో ప్రతిపాదనలు
- మహిళా సంఘాలకు రైస్‌మిల్లులపై ప్రకటన

అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టే 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టే ఈ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ఆకాంక్షలకు అనుగుణంగా నిధుల కేటాయింపులు ఉంటాయని అంతా భావిస్తున్నారు. మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సైతం జిల్లాలో, నియోజకవర్గాల్లో పర్యటించిన పలు సందర్భాల్లో ప్రాధాన్య ప్రాజెక్టులకు, పథకాలకు నిధులిప్పిస్తామని ప్రకటించడంతో ఆ మేరకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 4లక్షల ఎకరాలకు సాగునీరందించే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు (శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగమార్గం ప్రాజెక్టు)కు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి గత బడ్జెట్‌లో రూ.799కోట్ల నిదులు కేటాయించింది. అంతేగాక గ్రీన్‌చానల్ ద్వారా నిధులివ్వాలని కూడా నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు పనులను ఫిబ్రవరిలో ప్రారంభించగా, దురదృష్టవశాత్తు టన్నెల్ కూలి ఎనిమిదిమంది కార్మికులు గల్లంతవగా, పనులకు బ్రేక్‌పడింది. ఈ నేపథ్యంలో గత 26 రోజులుగా టన్నెల్‌వద్ద రెస్క్యూ ఆపరేషన్ జరుగుతుండగా, ఈ పనుల పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టు పనుల కొనసాగింపు,రెస్క్యూ ఆపరేషన్, రీడిజైన్ తదితర అంశాలపై ఈ బడ్జెట్‌లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వైద్యరంగానికి భారీగా నిధులిచ్చే అవకాశం...

పేదలకు నాణ్యమైన వైద్య అందించేందుకు ఈ బడ్జెట్‌లో నిధులిస్తారని భావిస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయాల్సి ఉంది. మోత్కూరు, మునుగోడు పీహెచ్‌సీలను 30పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేసి నిధులిస్తారని భావిస్తున్నారు. వీటితో పాటు జిల్లా కేంద్రాల్లోని జనరల్ ఆస్పత్రులకు నిధులతో పాటు, ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టుల నియామకానికి ప్రకటన చేస్తారని ఆశాభావం వెల్లడవుతోంది. నల్లగొండ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు భరోసా..

- మిగతా 7వ పేజీలో...

డిండి-ఏదుల అనుసంధానానికి నిధులు!

ఉమ్మడి జిల్లాలో కీలకమైన మరో సాగు నీటి ప్రాజెక్టు డిండి ఎత్తిపోతల పథకం పూర్తికి ఈ బడ్జెట్‌లో సమగ్రంగా నిధులు కేటాయిస్తారని అంచనావేస్తున్నారు. ఈ పథకంలో కీలకమైన ఏదుల-డిండి అనుసంధానం పనులు రూ.2,400కోట్లతో చేపట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులివ్వగా, ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. అదేవిధంగా డిండి ఎత్తిపోతల పథకం కింద ఉన్న ఏడు రిజర్వాయర్లకు, వాటి పరిధిలోని కాల్వల నిర్మాణాలకు ఈ బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయనున్నారు. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.300కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. వీటితో పాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణ పెండింగ్ పనులతో పాటు, ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన చిన్న ఎత్తిపోతల పథకాల పూర్తికి, పాత లిఫ్టుల ఆధునికీకరణ, నిర్వహణకు ఈ బడ్జెట్ ద్వారా నిధుల కేటాయింపు ఉంటుందని భావిస్తున్నారు.

వీటితో పాటు బునాదిగానికాల్వ, పిల్లాయిపల్లి కాల్వ, బెండలమ్మచెరువు, శేషలేటివాగు ఫీడర్ ఛానల్, కొండాపురం ఫీడర్‌చానల్ నిర్మాణాలకు నిధులిస్తారనే నమ్మకం కనిపిస్తోంది. గంధమళ్ల రిజర్వాయర్ నిర్మాణంతో పాటు, బస్వాపూర్ రిజర్వాయర్ ముంపుగ్రామాలకు పరిహారం ప్రకటిస్తారని తెలుస్తోంది. మరోవైపు శ్రీరాంసాగర్ రెండో దశ చివరి ఆయకట్టు భూములకు నీరందించేందుకు కాల్వల ఆధునీకరణకు నిధులివ్వాలనే డిమాండ్‌కు మోక్షం లభించాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.



• ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రపంచ సుందరి

ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరీశుడి ఆలయాన్ని మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా మంగళవారం దర్శించుకున్నారు. సంప్రదాయ చీరకట్టులో తిరువీధుల్లో అఖండ దీపారాధన చేసి కొబ్బరికాయ సమర్పించి సనాతన హిందూ ధర్మం, ఆలయ విశిష్టత, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం మొత్తం కలియతిరిగి శిల్పకళా సౌందర్యాన్ని ప్రశంసించారు. ఆమెకు ఆలయ పండితులు ఆశీర్వచనం చేశారు. - ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట

• సీఎంకు కృతజ్ఞతలు



ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపిన సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం


ఓటుకు ఆధార్ అనుసంధానం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నిడమనూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటుకు ఆధార్ కార్డు అనుసంధానం చేయనున్నట్లు అదనపు కలెక్టర్, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఈఆర్వో జే. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటుకు ఆధార్‌కార్డును కచ్చితంగా అనుసంధానం చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందని తెలిపారు. 2025 ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మృతిచెందిన వారి, పెళ్లి చేసుకుని వెళ్లిపోయిన వారిని, రెండు ఓట్లు ఉన్న వారిని ఓటరు జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఆర్ఐ దాడి రాజిరెడ్డి, సందీప్, ఆయా పార్టీల నాయకులు అంకతి సత్యం, ముంగి శివమారయ్య, బొల్లం రవి, కొండేటి శ్రీను, కొమాండ్ల గుర్వయ్య, ఎదుళ్ల వినీల్ రెడ్డి, మంద తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కారోబార్‌తండాలో సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి,మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంపు వల్ల ముంపునకు గురవుతున్న వద్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్‌తండ గ్రామంలో మంగళవారం జిల్లాకు చెందిన ఎస్‌డిసికార్యాలయ ఆర్ఐఅశ్విని ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. గిరిజనులు పునరావాసం కింద నిధులు మంజూరు పారదర్శకంగా జరగాలని, తడావాసులందరికీ నిబంధనల ప్రకారం నిధులు మంజూరు చేయాలని తండావాసులు సర్వే అధికారులను కోరారు. కార్యక్రమంలో రాంమూర్తి, కార్యదర్శి శిరీష, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం మార్కెట్‌కు రానున్న నేపథ్యంలో ధాన్యం సేకరణకు పౌరసరఫరాలు, వ్యవసాయ అనుబంధ శాఖలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ధాన్యం సేకరణ, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు ఉదయాదిత్య భవన్‌లో శనివారం నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. ధాన్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రేడ్ ఏ రకానికి రూ.2,320లు, సాధారణ రకానికి రూ.2,300ల మద్దతు ధర ప్రకటించాయన్నారు. సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ప్రకటించినట్లు తెలిపారు. ఈసంవత్సరం యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2లక్షల హెక్టార్లు సాగైందని, 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశముందని అంచనా వేసినట్లు తెలిపారు. మార్కెట్‌కు 11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో మిల్లర్లు 5,68,152మెట్రిక్ టన్నులు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ద్వారా 5,57,869 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. సిబ్బంది కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డీసీవో పత్యనాయక్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఛాయదేవి పాల్గొన్నారు.



చందంపేట కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ బైపాస్ జాతీయ రహదారి 565కు సంబంధించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నేషనల్ హైవే 565 నల్గొండ బైపాస్‌పై జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు, రెవెన్యూ అధికారులతో మంగళవారం తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. స్ట్రక్చర్లు, ఇతర నిర్మాణాలను సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జాతీయ రహదారుల సంస్థ విశ్రాంత భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, జాతీయ రహదారుల సంస్థ ధర్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్, నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పంతులమ్మగా మారి.. పాఠాలు బోధించి..

చందంపేట: మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు గణితం బోధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. 10వ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజ నం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఆడ పిల్లలను భారంగా కాకుండా బాధ్యతగా పెంచాలన్నారు. గర్భంలోనే ఆడ శిశువులను చంపే సంస్కృతిని విడనాడాలన్నారు. అంతకుముందు పీహెచ్‌సీని తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉందని మండల వైద్యాధికారి చందులాల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీలక్ష్మీ తదితరులు ఉన్నారు.

ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

నార్కట్‌పల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి పథకం కింద కూలీలతో పనిచేయిస్తున్న ప్రదేశాల్లో నీరు-నీడ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అవురవాణి గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పథకం పనులు చేస్తూ వడదెబ్బకు గురై చనిపోయే వారికి రూ.20లక్షలను నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేయాలన్నారు. నీడ కోసం టెంట్, దాహర్తి తీర్చడం కోసం నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటల లోపే పని ముగించేలా వేళల్లో మార్పు చేయాలన్నారు. కనీసం కూలి రూ.800లు వచ్చేలా చూడాలని కోరారు. సాగునీరు లేక ఎండిపోయిన వరి పొలాలకు ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం నాయకుడు చెర్కు పెద్దులు, రైతు సంఘం జిల్లా నాయకుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, దోటి రేణుక, పార్వతమ్మ,నర్సింహ్మ, అలివేలు, ప్రేమలత, ఎల్లమ్మ, లింగమ్మ, సాలమ్మ తదితరులున్నారు.



అవురవాణిలో ఎండిన వరిచేలను పరిశీలిస్తున్న నారి అయిలయ్య

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (బుధవారం సాయంత్రం)

సహర్: 5:00 (గురువారం ఉదయం)

ఆయకట్టు చివరకు నీరందించాలి



రైతులతో మాట్లాడుతున్న మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్

గుర్రంపోడు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ చివరి ఆయకట్టు వరకు నిరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ సూచించారు. మండల పరిధిలోని డీ-25 కాల్వను మంగళవారం పరిశీలించారు. ఆయకట్టు చివరి మారేపల్లి ప్రాంతానికి నీరు చేరేలా తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. 18 కిలోమీటర్ల పొడవునా గల డీ-25 కాల్వలో చివరి ఆయకట్టుకు నిరందించేందుకు కాల్వ ప్రారంభం నుంచి రైతులు అన ధికారికంగా ఏర్పాటు చేసుకున్న గండ్లు, పైపులన్నింటినీ తొలగించాలని ఆదేశించారు. అడ్డుపడితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుర్రంపోడు డివిజన్ ఈఈ నెహ్రూనాయక్, డీఈ పరమేష్, సురేష్‌కుమార్, ఏఈ శ్రీనివాసరావు, చంద్రప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

మిర్యాలగూడ: అదనపు ఓట్ల తొలగింపునకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారు. ఫాం-6, 7, 8లలో తలెత్తిన సమస్యల పరిష్కారంతో పాటు డుప్లికేట్ ఓట్లను తొలగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, కమిషనర్ యూసుఫ్ పాల్గొన్నారు.

నీటిని అడ్డుకోవద్దు

హాలియా: డీ-25 కాల్వ పైభాగంలో సాగు చేస్తున్న రైతులు దిగువకు రాకుండా నీటిని అడ్డుకోవడం సరికాదని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ అన్నారు. అనుముల మండలంలోని మారేపల్లి రైతులతో కలిసి డీ-25 కాల్వను మంగళవారం పరిశీలించారు. కాల్వలో ప్రవహిస్తున్న నీటిని ఎవరికి వారు అడ్డుకొని మళ్లిస్తే చివరి రైతులకు ఇబ్బంది అవుతుందన్నారు. ఇరిగేషన్ అధికారులు కాల్వను పర్యవేక్షించాలని సూచించారు. నిబంధనల ప్రకారం తూముకు సరిపడా నీరు వస్తుందన్నారు. ఆయన వెంట ఈఈ నెహ్రూ, డీఈ పరమేష్, తహసీల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, ఎస్ఐ సతీష్‌రెడ్డి, ఏవో సరిత పాల్గొన్నారు.

ఉద్యమాలే..మాకు ఉగ్గుపాలు

- నేడు తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి
- ఉద్యమ నాయకురాలిగా అందరికీ సుపరిచితం



అమ్మకు పిల్లలే మొదటి ప్రాధాన్యం. వారి ఆలనాపాలనలోనే పెరుగుతారు. కానీ మా అమ్మకు సమాజంలోని ప్రతీ వర్గం సమానం. వారి కష్టాలను తీర్చడమే ఆమె లక్ష్యంగా పనిచేసేవారు. నాన్న జైల్లో ఉండగా కూడా ఆమె మమ్మల్ని వదిలి ఉద్యమాల బాట పట్టేవారు. ఊర్లో వారు మమ్మల్ని చూసుకునేవారు. తెలియకుండా ఆమె మాకు ఉగ్గుపాలతోనే ఉద్యమాలను నేర్పింది, కష్టాలను, ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవడం ఆమె నుంచి స్ఫూర్తిగా తీసుకున్నవే. కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతూ.. ఆమెను చూసే మేము రాటుదేలామంటుంటున్నారు కమ్యూనిస్టు నాయకురాలు, తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం వారసులు. నేడు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా ఆమెతో అనుబంధాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



● కమ్యూనిస్టు దారిలో ఆమే స్ఫూర్తి

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

అమ్మ ఆయుధం పట్టి రజాకార్లకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం నడిపినట్టే వ్యవసాయం అంతే శ్రద్ధతో చేసేది. తుపాకిని గురిపెట్టి శత్రు శిబిరంపై దాడి చేయడంలో వ్యూహాలు పన్నినట్టే క్షేత్రంలో విత్తనాలు నాటి పంట దిగుబడి వచ్చేవరకు మహిళా రైతుగా ఎంతో శ్రమతో సాగు చేసేది. ఆమె స్ఫూర్తితోనే నేటికీ కమ్యూనిస్టు బాటలో నడుస్తున్నమంటున్నారు మల్లు స్వరాజ్యం పెద్దకుమారుడు మల్లు గౌతంరెడ్డి. అమ్మతో ఆయన అనుబంధం ఆయన మాటల్లోనే...



- మల్లు గౌతంరెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, నల్లగొండ

నాకు ఊహ తెలిసే నాటికి 1953-54లో సూర్యాపేట పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని రాయినిపాలెంలో గుడిసెలోనే మా నివాసం. ఆ ప్రాంతానికి మూసీ ప్రాజెక్టు ద్వారా సాగునీటి అవకాశం ఉండటంతో కర్విరాలకొత్తగూడెంలో అమ్మమ్మ చొక్కమ్మ ఇచ్చిన ఆస్తిని విక్రయించి రాయినిపాలెంలో భూమి కొనుగోలు చేశారు. 1962లో భారత్, చైనా యుద్ధం సమయంలో దేశంలో కమ్యూనిస్టులను అరెస్ట్ చేస్తుండటంతో నాన్న మల్లు వెంకటనర్సింహారెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లారు. అమ్మ వ్యవసాయ కూలీలతో కలిసి పొలం పనులకు వెళ్లేది. రాత్రి సమయాల్లో నీటి కోసం గస్తీ కాసేది. పోలీసులు ఇంటిపై దాడి చేసి పశువులు ఎత్తుకపోకుండా పక్కవారి కొట్టాల్లో కట్టేసేది. పంట రాశులు దోచకుండా ఇతరుల కళ్లాల్లో పోసి గడ్డితో కప్పేసేది. నిద్రాహారాలు మాని రాత్రికి రాత్రే ఈ పనులన్నీ తోటివారి సహకారంతో చేసేది. ఆమెను చూసి ఏ పనినైనా దీక్షతో చేయాలని చూసి నేర్చుకున్నాం.



తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయుధంతో స్వరాజ్యం(రౌండప్‌లో)



సమరయోధురాలిగా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి పురస్కారం అందుకుంటున్న మల్లు స్వరాజ్యం

కథలు కథలుగా చెప్పేవారు

తెలంగాణ ఉద్యమంలో గెరిల్లా శిక్షణ తీసుకుని అనేక సమస్యలను ఆమె ఎదుర్కొన్న తీరు, శత్రువుల కళ్లుకప్పి తప్పుకున్న ఘటనలు, తమ వారిని రక్షించుకునేందుకు పన్నిన మిలిటరీ వ్యూహాల గురించి మా ఇంటికి వచ్చే పార్టీ సీనియర్ నేతలు చెబుతుంటే వినేవాళ్లం. అజ్ఞాతంలో ఉన్నప్పుడు ఆస్తమా వచ్చి పడిపోతే ఆమెను వెంట తీసుకపోలేక మిగతా దళసభ్యులు వదిలేసి వెళితే రెండు రోజులకు కోలుకుని తిరిగి వచ్చినట్లు చెబుతుండేవారు. మరో సందర్భంలో స్వరాజ్యం ఓ ఇంటిలో ఉందని రజాకార్ల సేనలు ఊరును చుట్టుముడితే గౌడ ఇంటిలో తలదాచుకున్న అమ్మను ఇంటి ఇల్లాలు కల్లుకుండ నెత్తిన పెట్టి కొత్త కోడలుగా పోలీసులకు చెప్పి ఊరు దాటించిందట. ఉద్యమంలో నాయకురాలిగా వ్యవసాయంలో కూలీగా పనిచేసిన అమ్మ నన్ను, నా తోబుట్టువులను అంతే ఆప్యాయంగా చూసుకున్నారు. అమ్మ, నాన్న కుటుంబంతో కలిసి లేనప్పుడు ఊరంతా అమ్మానాన్నలై మమ్ములను ఆదుకున్నరు. అమ్మ మరణించేనాటికి ఆలిండియా మహిళా సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నారు.

ఉద్యమదీప్తి ఆమె

1975-77

ఎమర్జెన్సీ సమయంలో నాన్న అజ్ఞాతంలోకి వెళ్లగా అమ్మ సూర్యాపేట ప్రాంతంలో మహిళా సంఘం బాధ్యతలు చేపట్టింది. తన వాగ్ధాటితో ఎదుటివారిని కట్టిపడేసేది. ఉయ్యాల, బతుకమ్మ పాటలు తానే రాసుకుని పాటలు పాడేది. ఉద్యమంలోకి మహిళలను పెద్దఎత్తున ఆకర్షించేది. 1977లో ఎన్నికల్లో పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ ప్రజాసమస్యలపై తండాలు, దళితగూడెల్లోనే ఎక్కువగా పర్యటించేది, భూస్వాములు, బంచారాయి భూములపై పేదలకు పట్టాల మంజూరు కోసం చట్టసభల్లోనూ, బయట పోరాడింది. ఇళ్లపట్టాలు, తాగునీటి సమస్యలపై ఊరూరా కాలినడకన, బస్సుల్లోనే ప్రయాణించేది. ఆమె సాదాసీద జీవనమే మా నడవడికకు మార్గం వేశాయి.

● అమ్మ పోరాటం, మానవత్వం



పోరాటం, మానవత్వం, కష్టపడే తత్వం అమ్మ నాకు నేర్పినబాట. ఎటువంటి కష్టాన్నైనా ఎదుర్కొవాలనే మనోధైర్యాన్ని కల్పించింది. అమ్మ ఉద్యమంలో పనిచేస్తుండగా అనేకమార్లు పోలీసులు, భూస్వాముల నిర్బంధాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అజ్ఞాత జీవితంలోనూ, తిరిగి బహిరంగ ఉద్యమాల్లో పాల్గొంటూ అన్ని సమయాల్లోనూ తను చేయాల్సిన పనిపై తప్ప ఎదురయ్యే కష్టాల గురించి ఆలోచించేది కాదు. అమ్మ పోరాటంలో ఉంటే ఊరు జనమంతా మాకు చుట్టాలై ఆదరించేవారు. తీవ్ర నిర్బంధ సమయాల్లో మా టీచర్స్ కూడా మమ్మల్ని వారింటిలోనే ఉంచుకుని స్కూల్‌కు తీసుకవెళ్లేవారు. మా కోసమే మీ తల్లిదండ్రులు పోరాడుతున్నారని పేద వర్గాల ప్రజలు మా ఆలనాపాలనా చూసేవారు. ప్రజల కోసం పనిచేసే నాయకులంటే నాడు ప్రజలకు అంత ప్రేమ వుండేది. నేటి నాయకులపై ప్రజల్లో అభిమానం కొరవడుతోంది. నాడు పోలీసులు ఊరిమీదకు వచ్చారంటే ఊరంతా ఏకతాటిపైకి వచ్చేది. శిస్తు పేరుతో జప్తులకు వస్తే ప్రజలంతా ఏకమై ఎదురుతిరిగేవారు. చిన్న పిల్లలమైన మేము ఆ పరిస్థితులతో రాటుదేలాం. నాకు పెళ్లైయే నాటికి అమ్మ ఎమ్మెల్యేగా ఎన్నికైంది. అమ్మ మరణించేంత వరకు ఉద్యమాలతోనే నడిచింది. రైతు, కార్మిక, మహిళా ఉద్యమంలో క్రియాశీలక పాత్ర వహియించింది. ఉద్యమంలోనూ ఎందరికో తల్లిగా సేవలందించింది. తోటి వారికి సహాయ సహకారాలు అందించడానికి అమ్మే స్ఫూర్తి

పాదూరి కరుణ, మల్లు స్వరాజ్యం కుమార్తె

అత్త కాదు..అమ్మే

ఆమె స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి: కోడలు మల్లు లక్ష్మి

(ఆంధ్రజ్యోతి-భానుపురి)

మల్లు స్వరాజ్యం నాకు అత్త అయినా అమ్మలాగే చూసుకుంది. ఆమె తన ముగ్గురి పిల్లలతో పాటు నన్ను బాగా చూసుకున్నారు. 1988లో ఆమె కుమారుడు నాగార్జునరెడ్డితో హైదరాబాద్‌లో పెళ్ల జరిగింది. అప్పటి నుంచి మావద్ద ఆమె ఉంటోంది. అత్తలా కాకుండా అమ్మతో ఉన్న అనుబంధం మా ఇద్దరి మధ్య ఉంది.



మల్లు స్వరాజ్యంతో మనమడు అరుణ్‌రెడ్డి, కోడలు లక్ష్మి, కుమారుడు నాగార్జున్‌రెడ్డి(ఫైల్)

రాయినిగూడెం, నల్లగొండ, హైదరాబాద్‌లలో కలిసి 35ఏళ్లుగా కలిసి ఉన్నాం. ఆమె ధైర్యం, గంభీరత్వంతో భయపడేదాన్ని. పెళ్లి చేసుకున్న తర్వాత అమాయకంగా ఉండేదాణ్ణి. 2006లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పుడు 'అమ్మ' నవల చదవమని ఇచ్చారు. అదేవిధంగా పేపర్లలో వచ్చే ఎడిటోరియల్స్ చదవాలని చెప్పేది. అవి చదివితే దేశ రాజకీయాలపై ఆసక్తి పెరుగుతోందని చెప్పేవారు. ఇంటర్ వరకే చదువుకున్న నన్ను లైబ్రరీసైన్స్ కోర్సులో చేర్పించింది. అప్పట్లో ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో ఆమెకు వచ్చే తెలంగాణ స్వాంతంత్రసమరయోదురాలు పెన్షన్‌తో నన్ను చదివించింది. పాత ఎమ్మెల్యే కోర్టర్స్‌లో ఉండి చదువుకున్నా.

ఉద్యోగం చేయాలని వారి కోరిక

నేను ఉద్యోగం చేయాలని ఆమె కోరిక. టైప్ లోయర్, హైయర్ నేర్పించారు. కోర్టులో జాబ్ కోసం ప్రయత్నించినా రాలేదు. మామ డిగ్రీ పూర్తి చేసి లా చేయాలని చెప్పారు. జనాలకు ఎంతో ఉపయోగపడుతోందని చెప్పడంతో లా పూర్తి చేశా. నా భర్త నాగార్జున్‌రెడ్డి రాజకీయాల్లో ఉండడం, నేను ఉద్యోగం చేస్తే కుటుంబానికి ఆసరగా ఉంటామని అత్తా, మామల కోరుకునేవారు. లా పట్టా పొందినప్పుడు, టైప్ లోయర్, హైయర్ పూర్తి చేసినప్పుడు మల్లు స్వరాజ్యం చాలా సంతోషపడింది.

ఆమె ధైర్యం, గంభీరత్వం మాకు స్ఫూర్తి

రాజకీయ కుటుంబం నుంచి రాకున్నా అత్తా,మామల ఇంటికి వచ్చిన తర్వాతే రాజకీయ ప్రభావం నాపై పడింది. దీనికి తోడు మల్లు నాగార్జునరెడ్డి ప్రోత్సహించేవారు. ఇంట్లో కుటుంబం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేదాణ్ణి. వృధా ఖర్చులు చేయవద్దని అత్తమ్మ చెప్పేవారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం పని చేయాలని తపన ఉండాలని చెప్పేవారు. ఆమె ధైర్యం, గంభీరత్వమే మాకు స్ఫూర్తిగా నిలిచింది. వృద్ధాప్యం వచ్చినా పుస్తకాలు చదివేవారు. బయటి నుంచి పుస్తకాలు తెమ్మనిచెప్పేవారు. నాకు ఆమె స్నేహితురాలిగా, రాజకీయనాయకురాలిగా గంభీరత్వంతో ఉండేది. మామామ వెంటనర్సింహారెడ్డి కూడా చాలామంచిగా ఉండేవారు. 12 ఏళ్ల యన బాగోగులు చూడా. మల్లు స్వరాజ్యం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే అక్కడ సపర్యాలు చేశా. చనిపోయిన తర్వాత తన దేహం సైతం ఉపయోగపడాలని చెప్పడంతో నల్లగొండలోని మెడికల్ కళాశాలకు పార్థివదేహాన్ని ఇచ్చేశాం.

బాలికపై లైంగిక దాడి కేసులో

25 ఏళ్ల జైలు, జరిమానా

మోతె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 25ఏళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ బాలికల అత్యాచార నిరోధక చట్టం అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎం శ్యాం తీర్పుచెప్పారు. సూర్యాపేట జిల్లా మోతె ఎస్ఐ యాదవేందర్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం సమీప బంధువు మృతి చెందడంతో మోతె మండలానికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలు(బాలికలు)ను తీసుకుని వచ్చింది.అక్కడికి ఆమె బంధువువైన ఖమ్మం జిల్లా తిరుమలాయ మండలం కాకరవాయి గ్రామానికి చెందిన నల్లగట్టు లక్ష్మయ్య వచ్చారు. మహిళకు చెందిన ఆరేళ్ల బాలికను తాను చూసుకుంటానని తీసుకువెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత తిరిగి అప్పగించివెళ్లాడు. బాలికకు వాంతులు, తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అత్యాచారం జరిగినట్లు వైద్యులు నిర్ధారించడంతో మోతె పోలీస్‌స్టేషన్‌లో ఆ బాలిక తల్లి 2023 మే 29న ఫిర్యాదుచేసింది. నిందితుడు లక్ష్మయ్యపై సీఐ వీరరాఘవులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చిగా న్యాయస్థానం రెండు నెలలు రిమాండ్ విధించింది. బెయిల్‌పై వచ్చినప్పటి నుంచి కేసు నిలిపివేయాలని తన బంధువుల ద్వారా అతడు ఒత్తిడి చేసినా ఆ తల్లి పోరాటం నిలుపలేదు. తన పాపకు జరిగిన అన్యాయం ఏ ఒక్కరికీ జరగకూడదని కేసును ముందుకు తీసుకెళ్లింది. అనంతరం విచారణలో భాగంగా న్యాయస్థానం ఎనిమిది మంది సాక్షులను విచారించి నిందితుడికి 25 ఏళ్ల జైలు, రూ.20వేల జరిమానా, బాధితురాలికి రూ.5లక్షలు నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు.

అశ్రునయనాల నడుమ చక్రయ్య అంత్యక్రియలు



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న చక్రయ్యగౌడ్ రెండో కుమార్తె

నూతనకల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో సోమవారం హత్యకు గురైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య గ్రామంలో జరిగాయి. సూర్యాపేటలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని నూతనకల్ మీదుగా పోలీసు బందోబస్తు మధ్య మిర్యాలకు తరలించారు. చక్రయ్యగౌడ్ గృహంలో ప్రజల సందర్శన అనంతరం అంతిమయాత్ర ప్రారంభమైంది. ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఆయన రెండో కుమార్తె తీగల సరిత తండ్రికి తలకొరివి పెట్టి దహన సంస్కారాలు పూర్తిచేశారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ ఎస్పీ కొత్తపల్లి నరసింహ గ్రామంలోనే ఉన్నారు. ఏఎస్పీ నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు,10మంది సీఐలు, 30ఎస్ఐలు, 400మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పలు పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. అంతిమ యాత్రలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధాసుధాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మందుల భానుకిరణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, పసుల అశోక్‌యాదవ్, తొన్కునూరి సైదులు, పాల్వాయి నాగరాజు, ఉప్పుల పాపయ్య, రాచకొండ అయోధ్య, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హంతకులు వదిలి పెట్టేదిలేదు

మిర్యాల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్యగౌడ్‌ను హత్య చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేదిలేదని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. చక్రయ్య మృతదేహాన్ని సోమవారం రాత్రి సూర్యాపేట ఏరియాఆసుపత్రిలో సందర్శించి నివాళులర్పించి,కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ హత్య రాజకీయాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. హత్యకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు దోషులుగా నిలబెడతామన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అసెంబ్లీలో ప్రస్తావన

మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ హత్య ఉదంతాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. హంతకులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

హంతకులకు శిక్షలు తప్పవు: ఎస్పీ నర్సింహ

దేశంలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయి, నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పకుండా పడతాయని సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నర్సింహ అన్నారు. చక్రయ్య అంత్య క్రియలను మంగళవారం పర్యవేక్షించి, మాట్లాడారు. గ్రామంలో 24 గంటలు పికెంటింగ్ ఉంటుందన్నారు. హత్యకు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. హత్యకు సంబంధించి అన్నిరకాల ఆధారాలను సేకరించి నిపుణుల అభిప్రాయం తీసుకోవాలని సూచించారు. హత్యలు బాధాకరమన్నారు. యువత నేరాలకు పాల్పడితే జైలు శిక్షలు తప్పవన్నారు. దర్యాప్తులో వేగం, నాణ్యత పెరిగిందన్నారు. నర్సింహులగూడెం సర్పంచ్ హత్య కేసులో నేరస్తులు ఆరుగురికి జీవితఖైదు, మిర్యాలగూడ ప్రణయ్ హత్య కేసులో నేరస్తులకు ఒకరికి ఉరి శిక్ష, మిగతా వారికి జీవిత ఖైదు పడిందని గుర్తు చేశారు. చట్టం ముందు ఎవ్వరూ తప్పించుకోలేరన్నారు. నేరాలకు పాల్పడి కుటుంబాలకు దూరం కావద్దన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ: ఒకరి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మయ్య

మిర్యాలగూడ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని కోదాడ-జడ్చర్ల హైవే మంగళవారం సాయంత్రం ఆటోను లారీ ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందారు. రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ నుంచి అడవిదేవులపల్లికి వెళ్తున్న ఆటో ధీరావత్‌తండా ఎక్స్‌రోడ్డు వద్ద ప్రయాణికుడిని దింపే సమయంలో వెనుక వైపు నుంచి అతివేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. అడవిదేవులపల్లికి చెందిన కాటం ఆంజనేయులు సొంత ఆటోలో భార్య, కుమారుడితో మిర్యాలగూడ నుంచి వెళ్తున్నారు. మార్గమధ్యలో ఎఫ్‌సీఐ వద్ద బిహార్‌కు చెందిన కృష్ణకుమార్(22) ధీరావత్‌తండా ఎక్స్‌రోడ్డు వరకు వెళ్లేందుకు ఆటోలో ఎక్కాడు. ఎక్స్‌రోడ్డు వద్ద ఆటో నిలిపే సందర్భంలో హాలియా వైపు వెళ్తున్న లారీ వెనుక వైపు నుంచి అతివేగంతో ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న ఆటో డ్రైవర్, భార్య, కుమారుడికి గాయాలు కాగా కృష్ణకుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణకుమార్ ధీరావత్‌తండాలోని ఆయిల్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

తిప్పర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలో జరిగింది. నల్లగొండ రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా కనగల్ మండలం చిన్నమాదారం గ్రామానికి చెందిన వట్టికోటి ఎల్లేశం(37) ఓ రెస్టారెంట్‌లో సప్లయ్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చాలీచాలని వేతనంతో ఖర్చులు ఎక్కువగా అవడంతో తీవ్రమనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెందాడు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో రాయినిగూడెం-నల్లగొండ మధ్యలో రైల్వేట్రాక్‌పై ఉండగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అతడిపైనుంచి వెళ్లింది. లోకో పైలెట్ ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రేల్వే సిబ్బంది మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసిన అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు. ఎల్లేశంకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుర్కపల్లిలో ఆది మానవుల ఆవాసాలు

● చారిత్రక పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



తుర్కపల్లి మండలకేంద్రంలోని గుట్టలపై డాల్మెన్ సమాధుల వద్ద రత్నాకర్‌రెడ్డి

తుర్కపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి గుట్టలపై ఆది మానవుల ఆవాసాలు గుర్తించామని చారిత్రక పరిశోధకుడు, జనగామ జిల్లాకు చెందిన రెడ్డి రత్నాకర్‌రెడ్డి (డిస్కవరీ మ్యాన్) తెలిపారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో గుట్టలను పరిశీలించిన ఆయన సంబంధిత వివరాలను విలేకరులకు తెలిపారు. తుర్కపల్లి మండల కేంద్రం దట్టమైన అడవులు, అనేక లోయలతో కూడిన ప్రాంతమని, బృహత్ శిలా యుగం సంస్కృతికి చెందిన ఆది మానవులు ఈ ప్రాంతంలో ఆవాసాలు ఏర్పరచుకున్నారని తెలిపారు. గుట్టలపైన విశాలమైన ఉపరితలం కలిగిన సమతుల ప్రాంతంలో బృహత్ శిలా యుగం నాటి నిర్మాణాలు కనిపిస్తాయని, వీటిని డాల్మెన్ సమాధులుగా పిలుస్తారని వివరించారు.

సమాధుల నిర్మాణం ఇలా:

గుట్టలపైన చుట్టూ రెండు నుంచి మూడు అడుగుల ఎత్తులో చిన్నచిన్న రాళ్లను ఒక దానిపై మరొకటి పేర్చి ఆ నిర్మాణంపై విశాలమైన క్యాప్ స్టోన్‌ను అమర్చి ఉంచారు. గుట్టలపై అనేక విశాలమైన సమాధులు ఉన్న ఆనవాళ్ల ప్రకారం గుట్ట దిగువన ఆది మానవులు జీవించి ఉండవచ్చునని తెలుస్తోందని తెలిపారు. ఎండ, వానల కారణంగా శిలలు శిథిలమై కూలిపోతున్నాయన్నారు. గ్రామ పరిధిలో 11వ శతాబ్దం నాటి వీరుల దేవాలయం ఉందని, ఇక్కడి వీరగల్లు శిల్పాలు ఎంతో ప్రత్యేకమైనవని, ఇవన్నీ భూమిలో కూరుకుపోయాయన్నారు. ఆది మానవులు విల్లు, ఈటె వంటి సాధనాలను వాడేవారని, పశు సంపదను కాపాడుకునే క్రమంలో ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని తెలిపారు. ఒక మండపం కింద పెద్ద గండ శిల పూజలందుకుంటున్న గుర్తులు ఉన్నాయని, భూమిలో కూరుకుపోయిన శిల్పాలను పైకి తీసి నిలబెడితే భవిష్యత్‌తరాలకు గ్రామ చరిత్ర తెలుస్తుందన్నారు.

దివ్యాంగుల కోసం లక్ష సంతకాల సేకరణ

భువనగిరి టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలంటూ లక్ష సంతకాల సేకరణ చేపట్టినట్లు ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి బస్టాండ్‌లో మంగళవారం ఆయన లక్ష సంతకాల సేకరణను కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 12.02 శాతం దివ్యాంగులు ఉన్నారన్నారు. ఇప్పటికే రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలలో దివ్యాంగుల రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల్లో వారికి ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, మురళి నాయక్, శ్రీహరి, నరేష్, అబ్బాస్, మధు తదితరులు పాల్గొన్నారు



భువనగిరి బస్టాండ్‌లో సంతకాల సేకరిస్తున్న ప్రకాశ్

మోసపూరిత భూవిక్రయాలపై

విచారణ చేపట్టాలి

యాదాద్రి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 322/4/ఏఏ నుంచి 322/4/ఎల్‌యుయు వరకు నిషేధిత ఖాతాల్లో ఉన్న భూములకు మోసపూరితంగా రిజిస్ట్రేషన్లు జరిగాయని, వీటిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) డైరెక్టర్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. పలు రియల్‌ఎస్టేట్ సంస్థలు నిషేధిత భూముల్లో అక్రమంగా లేఅవుట్లు రూపొందించి భూములు విక్రయించారని, నాలా పర్మిషన్ లేకుండానే ప్లాట్లు విక్రయించారని, ఈ మేరకు తెలంగాణ రియల్‌ఎస్టేట్ సఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లూరి శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ సర్వేనెంబర్లలోని భూములపై విచారణ జరిపేందుకు రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ సర్వే నెంబర్లలో ఒరిజినల్‌గా ఉన్నటు భూమి కంటే అదనంగా విక్రయించారని, సమగ్ర న్యాయ విచారణ జరిపి ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

స్లాట్ బుకింగ్ విధానం శుభపరిణామం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించడం శుభ పరిణామమని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. మెరుగైన సేవలను అందించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌తోపాటు బయోమెట్రిక్ విధానాన్ని తీసుకురానుండడం హర్షణీయమన్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే జవాబుదారీతనం పెరగడంతో పాటు సమయం వృథా కాదని ప్రజలు పేర్కొంటున్నారు. -(ఆంధ్రజ్యోతి -చౌటుప్పల్)

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరం



ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రవేశ పెట్టడం హర్షణీయం. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తొందరగా పూర్తవుతుంది. ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవడం వల్ల విక్రయించే వారికి, కొనుగోలు చేసేవారికి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలి.

-కుక్కల నరసింహ, చౌటుప్పల్

సమయం ఆదా అవుతుంది



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరియైనదే. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం ద్వారా సమయం ఆదా అవుతుంది. విక్రయదారులు, కొనుగోలు దారులు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పని ఉండదు. దీంతో వారికి ఎలాంటి ఇబ్బంది కలగదు. ప్రభుత్వం అమలు చేసే విధానంతో పారదర్శకత పెరుగుతుంది.

- జక్కిడిచంద్రారెడ్డి, సంస్థాన్ నారాయణపురం

మంచి పరిణామం



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయడం మంచి పరిణామం. ఈ విధా నం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తవుతుంది. స్లాట్ బుకింగ్‌లో మనకు ఏ సమయం అయితే ఇస్తారో ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని వెళ్లే అవకాశం ఉంది. విక్రయ దారులు కొనుగోలుదారులు కూడా ముందుగా కార్యాలయాలకు వచ్చి నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. రిజిస్ట్రేషన్లలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలి.

-నందగిరి జగత్ కుమార్, సర్వేల్

జాగ్రత్తలు తీసుకోవాలి



వ్యవసాయ భూముల మాదిరిగా ప్లాటులకు కూడా స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించడం వల్ల సమయం ఆదా అవుతుంది. ప్లాటు రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే కొన్ని సందర్భాల్లో రోజంతా సమయం గడిచిపోతుంది. ఈ విధానంతో మనకు ఏ టైం కేటాయిస్తే ఆ సమయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం సాంకేతిక పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. -ఆర్.నరసింహ, చౌటుప్పల్

అసెంబ్లీలో మన గళం

చౌటుప్పల్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



చౌటుప్పల్ టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పైలాన్‌ను నిర్మించిన చౌటుప్పల్ పట్టణంలోనే తాగునీళ్లు లేవని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళ వారం జీరో అవర్‌లో రాజగోపాల్‌రెడ్డి చౌటుప్పల్ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా కోసం రూ. 50 వేల కోట్లు ఖర్చు చేసింది కానీ లక్ష్యం మాత్రం నెరవేరలేదని అన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కృష్ణా జలాలను అందించాలని కోరారు. అలాగే చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లో భూగర్భజలాలు పడిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చౌటుప్పల్‌లో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు.

దళితుల పెద్దన్న..సీఎం రేవంతన్న


● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లి : దళితుల పెద్దన్న..సీఎం రేవంతన్న అంటూ నకిరేకల్ ఎమ్మె ల్యే వేముల వీరేశం సీఎం రేవంత్ రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో మంగళవారం ఆమోదం పొందిన సందర్భంగా ధన్యవాదం తెలుపుతూ జరిగిన చర్చలో ఎమ్మెల్యే మాట్లాడారు. రిజర్వేషన్ బిల్లుపై సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే పలు వేదికలపై నిబద్ధత చూపారని ఇప్పుడు సీఎంగా చిత శుద్ధితో వ్యవహరించి రిజర్వేషన్ బిల్లును ఆమోదించడమే కాదు. సుప్రీంకోర్టులో తీర్పు వేగంగా వచ్చేందుకు చేసిన కృషి మరువలేనిదన్నారు. సీఎం చూపిన చిత్తశుద్ధిపై కొందరికీ కంటగింపుగా ఉం దన్నారు. అణగారిన తమ సామాజిక వర్గాల అభ్యున్నతికి ప్రయత్నం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దళితుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని కొనియాడారు.

నిధులు మంజూరు చేయాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీని గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవాలని అందుకు ప్రభుత్వం నిధులిచ్చి సహకరించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ లింకురోడ్ల ఏర్పాటు, మంజూరైన నాలుగు నూతన ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. వాడపల్లి -గణేష్‌పహడ్ మధ్య వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన గ్రామస్థులు, రైతులకు ఆర్అండ్‌ఆర్ బాధి తులకు జాబ్‌కార్డులు అందజేయాలని కోరారు. వాడపల్లి ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో కొత్త భవనం 80 శాతం పనులు పూర్తయినందున మిగిలిన పనులు పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు.

కోలాహలంగా యాద'గిరి'ప్రదక్షిణ

● నారసింహనామ స్మరణతో భక్తి పారవశ్యం

యాదగిరిగుట్ట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నమో నార సింహా..నమో భక్తపాలా..అంటూ గోవింద నామస్మరణల మధ్య మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ కొనసాగింది. ప్రతీ నెలా స్వాతి నక్షత్రం రోజున ఆలయ ముఖమండపంలో స్వామివారి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. వేద పండితుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ దేవస్థానం ఆధ్వర్యంలో ఈవో ఏపూరి భాస్కర్‌రావు గిరిప్రదక్షిణ ప్రారంభించారు. అంతకు ముందు నుంచే భక్తులు గిరిప్రదక్షిణ మొదలు పెట్టగా స్వామివారి ఆరగింపు వేళ వరకు సుమారు 18వేల మంది గిరిప్రదక్షిణ చేశారు. గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు సుదూర ప్రాం తాల నుంచి వాహనాలపై వచ్చిన భక్తులతో ఉదయం 9 గంటల వరకు వైకుంఠద్వారం కూడలి వాహనాలు, భక్తులతో కిక్కిరిసిపోయి భక్తుల నమో..నారసింహ నామంతో ప్రతిధ్వనించింది. తెల్లవారుజామున గిరిప్రదక్షిణ మహోత్సవంలో స్వామివారిని స్తుతిస్తూ ప్రత్యేక వేషధారణలు, కళాకారుల కోలాటాలు, కూచిపూడి నృత్యాలు, భజనలు, కీర్తనలతో హోరెత్తించారు. రెండున్నర కిలోమీటర్ల మేర సుమారు 45నిమిషాల పాటు గిరిప్రదక్షిణ చేయగా ఈ వేడుకల్లో కొండెక్కి కొంతమంది, మరికొంత మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్ పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్ సారథ్యంలో పోలీసులు బారికేడ్ల సహాయంతో బందోబస్తు నిర్వహించారు.



యాదాద్రిలో గిరి ప్రదక్షిణలో భక్తజనసందోహం

అష్టోత్తర పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థాన పరంగా ఆరాధనల అనంతరం ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 108 వెండి కలశాలు వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేపట్టారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి, 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



వైకుంఠద్వారం వద్ద హారతి ఇస్తున్న అర్చకుడు, పాల్గొన్న ఈవో భాస్కర్‌రావు

కాగా స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.21,14,642ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో స్వర్ణ దివ్య విమాన రాజగోపురానికి ఫెన్సింగ్ బిగించే పనులు చకచకా సాగుతున్నాయి. మంగళవారం నుంచి చుట్టూ గోడ నిర్మించే ప్రక్రియ కొనసాగింది. ఇది పూర్తి కాగానే సోలార్ బిగింపు ప్రక్రియ వేగవంత చేయనున్నారు. ఎండలు మండుతున్న వేళ ఆలయ పరిసరాల్లో భక్తులకు నీడ ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్తర తిరువీధిలో జర్మన్ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ తొలుత గత శుక్రవారం ముందు భాగం పూర్తి చేయగా రథశాల ముందు భాగంలో రెండో విడత మంగళవారం షెడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఉత్తర దిక్కులో నీడ ఏర్పాటు పూర్తి కాగా ఆలయ తూర్పు భాగంలో షెడ్డు వేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	518.80
టీఎంసీలు	147.0970
ఎడమకాల్వకు నీటి విడుదల	8,629
కుడికాల్వకు	7,033
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	17,462క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.58 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46 (టీఎంసీలు)
ప్రస్తుత నీటి మట్టం	629.82 అడుగులు
టీఎంసీలు	1.37 (టీఎంసీలు)
కాల్వలకు విడుదల	362.88 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	428.61 క్యూసెక్కులు

ఉద్యోగులకు ప్రభుత్వానికి వారధిగా ఉంటా



కోదాడలో క్రీడా పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కోదాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కోదాడలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వయస్సుతో సంబంధం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి రిటైర్డు ఉద్యోగులు రాష్ట్ర స్థాయి క్రీడలో పాల్గొనటం అభినందనీయం అన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని అన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

షటిల్ విభాగంలో.. రాష్ట్ర స్థాయిలో కామారెడ్డి జిల్లా మొదటి స్థానం సాధించగా, నిజామాబాద్ ద్వితీయ స్థానం

టెన్నికాయిట్ విభాగంలో.. సూర్యాపేట జిల్లాప్రథమ స్థానంలో, యాదాద్రి భవనగిరి జిల్లా ద్వితీయ స్థానం

క్యారమ్స్ విభాగంలో.. కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానం, ఖమ్మం జిల్లా ద్వితీయ స్థానం

చెస్ విభాగంలో.. పెద్దపల్లి జిల్లా ప్రథమస్థానం, కరీంనగర్ జిల్లా ద్వితీయ, పారుపల్లి చంద్రశేఖర్ (హుజూర్‌నగర్) తృతీయ స్థానం

మహిళల వాకింగ్ పోటీల్లో..

జనగామ జిల్లా ప్రథమ స్థానం, సూర్యాపేట జిల్లా ద్వితీయ స్థానం,

మ్యూజికల్ చైర్ విభాగంలో..

జనగామ జిల్లా ప్రథమ స్థానం, సూర్యాపేట జిల్లా ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, రిటైర్డు ఉద్యోగుల కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్, బొల్లు రాంబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, తీగల నరేష్, టి.వీరబాబు, భ్రమరాంబ, రఘు పాల్గొన్నారు.

ఏకపాత్రాభినయంలో.. దర్శారి వెంకటేశ్వర్లు మొదటి బహుమతి,

కవితాగానంలో.. నందిగామ రత్నకుమారి తృతీయ బహుమతి సాధించింది. ఈ ముగ్గురిని విశ్రాంత రిటైర్డు ఉద్యోగుల సంఘం హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నా సోమయ్య, కొప్పుల వీరారెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎన్ రాజు, లక్ష్మయ్య, దేవదానం, చంద్రయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అర్థశాస్త్ర పరిజ్ఞానం అవసరం

● గుల్బర్గా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెమ్

మిర్యాలగూడ టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అర్థశాస్త్ర పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరం.. దైనందిన జీవితంలో దీని ప్రాముఖ్యం ఎనలేనిదని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, గుల్బర్గా విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెమ్ అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యతో కాకుండా వ్యూహాలతో సమాజాన్ని ముందుకు నడిపించేది ఆర్థిక శాస్త్రమన్నారు. నిరంతర అధ్యయనం, అన్వేషణలతో కూడిన పరిజ్ఞానాన్నే ఎకనామిక్స్ అంటారన్నారు. అర్థ్ అంటే అంత సులువు కాదని, ప్రతీ సబ్జెక్టుతో అనుసంధానమైనదన్నారు. గతంలో సంప్రదాయ కోర్సులలో ప్రావీణ్య మున్నవారే ముఖ్య పరిపాలకులయ్యే వారని గుర్తు చేశారు. విద్యార్థులు ఆర్థికశాస్త్రం పట్ల అవగాహన, ఆసక్తి పెంచుకోవాలని సూచిం చారు. మరో కర్ణాటక ప్రొఫెసర్ అన్నా సాగర్ మాట్లాడుతూ సెమినార్లు విద్యార్థులు దృష్టి కోణాన్ని మార్చడంతో పాటు నూతన ఆలోచనలు రేకెత్తిస్తాయన్నారు. ధృడమైన ఆర్థిక విధానాలు, వాటి ప్రభావమనే అంశాలపై చర్చ జరగడం మంచి పరిణామమన్నారు. ఎంజీయూ ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఆవిర్భవించిన తెలంగాణ ఆర్థికాభివృద్ధి అంశాలపై సదస్సులో చర్చ జరగడం ఉపయోగకరమన్నారు. అర్థ శాస్త్రం భారతీయ పురాతన గ్రంథమని కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ నరేష్ గుమ్మడి, వైస్‌ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకర్‌రావు, నర్సింగ్ కోటయ్య, స్వప్న, రేఖారాణి పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెమ్

ఉమ్మడి జిల్లా పర్యాటకానికి రోప్‌వే తోరణం

(5వ పేజీ తరువాయి)

ఖిల్లాను స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపిక చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఖిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేశారు. మొదటి దశలో కేటాయించిన రూ.56.81కోట్లతో రాష్ట్ర పర్యాటకశాఖ అధికారులు ఇటీవల టెండర్లు పిలిచారు. మొదటి దశలో ప్రతిపాదించిన పనులు పూర్తయిన వెంటనే రెండో దశలో మరిన్ని పనులు చేపడతారు. దీంతో భువనగిరి ఖిల్లా వైభవం పెరగడంతోపాటు స్థానికంగా ఉపాధి, వ్యాపార, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఇప్పటికే భువనగిరి ఖిల్లాపై ట్రాన్సెండ్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో సాగుతున్న పర్వతారోహణలో సాగుతున్న శిక్షణతో పదుల సంఖ్యలో పర్వతారోహకులు ఎవరెస్టు సహా ప్రపంచంలోని పలు ఎత్తయిన పర్వతాలను అధిరోహించారు. ప్రపంచ పర్వతారోహణ రంగంలో భువనగిరి ఖిల్లా కీర్తిని సుస్థిరం చేశారు. సముద్ర మట్టానికి సుమారు 600 మీటర్ల ఎత్తులో ఉన్న భువనగిరి ఖిల్లాపై కోటగోడ తదితర నిర్మాణాలను ఆరో త్రిభువన మల్లా విక్రమాదిత్య పాలనలో నిర్మించినట్టుగా, కాకతీయుల పాలనలో మరిన్ని నిర్మాణాలు సాగినట్టు చరిత్రకారులు పేర్కొంటున్నారు.

రూ.56.81కోట్లతో పనులు ఇలా..

ఖిల్లాకు మొదటి దశలో మంజూరైన నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందుకోసం ఇప్పటికే రెండు దఫాలుగా సుమారు నాలుగు ఎకరాల ప్రైవేట్ స్థలాన్ని సేకరించి నిర్వాసితులకు పర్యాటకశాఖ నష్టపరిహారం చెల్లించింది. పనుల్లో కీలకమైన రోప్‌వేను బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేయనున్న బేస్‌క్యాంప్ నుంచి ఖిల్లాపైకి రూ.15.20కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. రూ.10.73కోట్లతో ఖిల్లా మెట్ల మార్గం ముఖద్వారం నుంచి రోప్‌వే బేస్ క్యాంపు వరకు వంద ఫీట్ల రోడ్డు, పార్కింగ్, రూ.1,037కోట్లతో ప్రస్తుత ఖిల్లా ముఖద్వారం అభివృద్ధి, కార్యాలయ నిర్మాణం, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ, రూ.9.40కోట్లతో రెస్టారెంట్లు, వెడ్డింగ్‌జోన్, లిఫ్ట్, గ్లాస్ వాకింగ్ పాత్ తదితర పనులు చేపడతారు. రూ.11.11కోట్లతో తాగు నీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విశ్రాంత కూడళ్లు, గ్రీనరీ, లైటింగ్, సీసీ కెమెరాలు తదితర మౌలిక వసతులు కల్పిస్తారు. భవిష్యత్తులో సౌండ్ అండ్ లైటింగ్ సిస్టం, లేజర్‌షోలు తదితర పనులు చేపట్టే అవకాశం ఉంది.

రాష్ట్రంలో మొట్టమొదటి రోప్‌వే

పర్యాటకరంగంలో రోప్‌వేకు అత్యంత ఆదరణ, ఆకర్షణ ఉంటుంది. భూమట్టానికి వందల మీటర్ల ఎత్తులో తీగల ఆధారంగా గాలిలో తేలినట్టు ఉండే రోప్‌వేతో ఆధారంగా సంచరించడంపై అంతా ఆసక్తి చూపుతుంటారు. అయితే ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో శ్రీశైలం క్షేత్రంలో రోప్‌వే ఉండగా పునర్విభజతో ఏర్పడిన తెలంగాణలో మొట్టమొదటి రోప్‌వేను భువనగిరి ఖిల్లాపైకి నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆనకట్టపై ఐదు కిలోమీటర్లు, ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్టపైకి, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండపైకి రెండేసి కిలోమీటర్ల చొప్పున రోప్‌వేల నిర్మాణాన్ని పర్వతమాల ప్రాజెక్టు కింద మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఇటీవల ప్రతిపాదనలు పంపింది. ఆ మూడు ప్రతిపాదనలకు కేంద్రం ఓకే చెబితే ఉమ్మడి జిల్లాలో నాలుగు రోప్‌వేలు కనువిందు చేయనున్నాయి.

టెండర్లు ఖరారుకాగానే పనులు



చారిత్రాత్మక భువనగిరి ఖిల్లా అభివృద్ధికి స్వదేశీదర్శన్ 2.0లో మంజూరైన రూ.56.81కోట్లతో రాష్ట్ర పర్యాటకశాఖ టెండర్లు పిలిచింది. టెండర్లు ఖరారైన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. సుమారు రెండేళ్ల లోపు ప్రతిపాదిత పనులు పూర్తిచేయాల్సి ఉంది. రోప్‌వే తదితర పనులన్నీ పూర్తయితే రాష్ట్ర పర్యాటక రంగంలో భువనగిరి ఖిల్లా ఐకాన్‌గా ఉండనుంది. ఇప్పటికే పర్యాటకుల తాకిడి ఉ న్న ఖిల్లాకు త్వరలో దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. చెపట్టే అభివృద్ధి పనులకు స్థానికులు సహకరించాలి.

- ధనుంజనేయులు, యాదాద్రి జిల్లా పర్యాటకశాఖ అధికారి

బడ్జెట్ వైపే అందరి చూపు

(5వ పేజీ తరువాయి)

కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా ఏరియా ఆస్పత్రులు కేంద్రంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో అందుకోసం ఈ బడ్జెట్ ద్వారా కార్యాచరణ ప్రకటిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్‌కు నిధులు

ఏఎమ్మార్పీ ప్రాజెక్టు కింద ఉన్న ప్రధాన కాల్వ ఆధునికీకరణకు అవసరమైన నిధులు ఈ బడ్జెట్‌లో కేటాయించనున్నట్టు సమాచారం. ఈ మేరకు జిల్లా నీటిపారుదలశాఖ విభాగం నుంచి సుమారు రూ.400కోట్ల పైచిలుకు నిధులతో ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. ఈ బడ్జెట్‌లో వీటికి నిధుల కేటాయింపులుంటాయని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు పూర్తికి కూడా అవసరమైన నిధులిస్తారని భావిస్తున్నారు.

విద్యాసంస్థలకు ఊతం దక్కేనా?

జిల్లాలో ఉన్నత విద్యావకాశాలు మెరుగుపరచేలా అవసరమైన డిగ్రీ కళాశాలలు, పీజీ కళాశాలల ఏర్పాటుకు ఈ బడ్జెట్ ద్వారా మార్గదర్శనం చేస్తారని భావిస్తున్నారు. హుజూర్‌నగర్‌లో పీజీ కళాశాల, నార్కట్‌పల్లిలో డిగ్రీ, మిర్యాలగూడలో మహిళా డిగ్రీ, మునుగోడు, కోదాడలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ఆమోదం లభిస్తుందని, హాలియాలో ఇప్పటికే ఉన్న డిగ్రీ కళాశాలకు నూతన భవన సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులిస్తారని ఆశిస్తున్నారు. అదేవిధంగా ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 12 ఏటీసీలలో (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు) వచ్చే విద్యాసంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభించేందుకు అవసరమైన నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారని భావిస్తున్నారు.

మహిళా సంఘాలకు రైస్‌మిల్లుల బాధ్యత

మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఇప్పటికే ఇందిరాశక్తి క్యాంటీన్లు, సోలార్ ప్రాజెక్టులతో పాటు, పెట్రోల్ స్టేషన్లను మహిళా సంఘాలకు కేటాయిస్తున్న ప్రభుత్వం, తాజాగా రైస్‌మిల్లులను మహిళా సంఘాలకు ఇవ్వాలని నిర్ణయించింది.

ఎంజీయూకు రూ.309కోట్లు

మహాత్మాగాంధీ యూనివర్సిటీకి గత బడ్జెట్‌లో కేవలం నిర్వహణ పద్దు కింద రూ.34.09కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రగతి పద్దు కింద ఎలాంటి నిధులివ్వక పోవడంతో యూనివర్సిటీలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. ఈ సారి ఉన్నతవిద్యామండలి అనుమతితో పలు అభివృద్ధి పనులకు రూ.309కోట్లతో యూనివర్సిటీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు మంజూరైతే యూనివర్సిటీలో కొత్తగా ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఏ (గవర్నెన్స్ అండ్ పబ్లిక్‌పాలసీ), ఎంఏ (డెవలప్‌మెంట్ స్టడీస్), బీఫార్మసీ కోర్సులను ప్రవేశపెట్టేందుకు అవసరమైన అధ్యాపక పోస్టులు, కళాశాల భవనాలను నిర్మిస్తారు. అదేవిధంగా సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను కొన్నింటినైనా రెగ్యులర్ బడ్జెట్ కోర్సులుగా మార్చనున్నారు. అదేవిధంగా ప్రతిపాదించిన మేరకు నిధులిస్తే పానగల్‌లో క్యాంపస్, ఇంజనీరింగ్ కళాశాల, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు ఆస్కారముంటుంది. నిధులు మంజూరయ్యేదాన్నిబట్టి ఉన్నత విద్యామండలి ఏ పనులు చేపట్టాలో నిర్ణయించనుండడంతో ఏమేరకు నిధులొస్తాయనే అంశంపై యూనివర్సిటీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

'చేనేత'పై ఛత్తీస్‌ఘడ్ విద్యార్థి బృందం అధ్యయనం



చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఫ్యాషన్‌డిజైన్ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన 'ఎమిటీ' యూనివర్సిటీలోని ఫ్యాషన్ టెక్నాలజీలో ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ చదువుతున్న 15 మంది విద్యార్థుల బృందం చేనేత అధ్యయనంలో భాగంగా మంగళవారం యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు చేనేత వస్త్ర తయారీ, పరిశ్రమ తీరుతెన్నులపై అధ్యయనం చేశారు. పట్టణంలోని చేనేత కార్మికుల గృహాలను, కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ సందర్శించి లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్‌పై పరిశీలన జరిపారు. పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరల తయారీని వారు పరిశీలించారు. చేనేత కళాకారులు రూపొందించిన అద్భుతమైన చేనేత డిజైన్లను చూసి వారి కళాత్మక ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ దీప్తిక, ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను, వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని, ఇక్కడి చేనేత కళాకారులు డిజైన్లను అద్భుతంగా రూపొందించారని కితాబు పలికారు.

త్రోబాల్ జాతీయస్థాయి పోటీలకు మోత్కూరు విద్యార్థులు

మోత్కూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాదు అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 16న నిర్వహించిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో మోత్కూరు సేక్రెడ్ హార్ట్ హై స్కూలు విద్యార్థులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఎం.తానయ్య అన్నారు. బాలికల విభాగంలో ఎంపికైన పి.ప్రియాంక, పి.మేరీవర్షిత, జి.వర్షిణి, బాలుర విభాగంలో ఎంపికైన కె.హర్షవర్ధన్, ఓ.శివస్వామిలను మంగళవారం ఆయనతో పాటు పీడీ ఎం.యాదయ్య, పీఈటీ చాంద్‌పాషా, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు ఈ నెల 28 నుంచి 30 వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ త్రోబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఉపాధి హామీ పనులపై నేడు ఓపెన్‌ఫోరం

కనగల్, మార్చి 18.(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో 1-4-2023 నుంచి 31-3-2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై బుధవారం మండల పరిషత్‌కార్యాలయంలో ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.జయరాం మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్ సిబ్బంది తగు సమాచారంతో సకాలంలో ఓపెన్‌ఫోరానికి హాజరుకావాలని ఆదేశించారు.

'రాజీవ్ యువ వికాసం' నిరుద్యోగులకు వరం

నాంపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని టీపీసీసీ నాయకుడు బట్టు జగన్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో 5 వేల మంది చొప్పున స్వయం ఉపాధి పొందేందుకు రూ. 6 వేల కోట్లు మంజూరు చేసిందన్నారు.

పీహెచ్‌సీలపై పర్యవేక్షణ ఏదీ?

గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కీలక పోస్టుల కొరత వేధిస్తోంది. దీంతో ప్రజలకు సేవలు అందడం లేదు. అంతేకాకుండా కొన్ని కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.
- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

» కొన్నిల్లో ప్రధాన పోస్టులు ఖాళీ! » కొన్ని ప్రాంతాల్లో కనిపించని సమయ పాలన
» నార్కట్‌పల్లి పీహెచ్‌సీలోవృథాగా నీటి శుద్ధి యంత్రం » అన్ని కేంద్రాల్లో నిరుపయోగంగా జనరేటర్లు



కేతేపల్లిలోని 24 గంటల వైద్యసేవలందించే పీహెచ్‌సీ భవనం

నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా ఆరోగ్య కార్యక్రమా లపై సిబ్బందికి మార్గదర్శనం చేసే సీహెచ్‌వో, కాన్పులు చేయగలిగే నైపుణ్యం ఉన్న స్టాఫ్ నర్సుల వంటి కీలక పోస్టులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించే ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫార్మాసిస్టు లేని చోట్ల ఇతర విభాగం సిబ్బంది చేత రోగులకు మందుల పంపిణీ చేయిస్తుండగా ఉన్న చోట కూడా ఏఎన్ ఎంలతో పంపిణీ చేయిస్తున్నట్లు తెలుస్తుంది. పర్య వేక్షణ కొరవడటంతో కొన్ని కేంద్రాల్లో సిబ్బంది సమ య పాలన పాటించడం లేదన్న విమర్శలు విని పిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉప కేంద్రాల్లో ఏఎన్‌ఎంలను నియమించి గ్రామీణ ప్రజలకు ప్రభు త్వ వైద్యాన్ని అందు బాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నప్పటికీ కొన్ని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, సబ్ సెంటర్ల సిబ్బంది విధులకు హాజరు కావడంలో సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణ వినపిస్తున్నాయి. అక్కెనపల్లి పీహెచ్‌సీని ఇటీవల జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి సమా చారం లేకుండా విధులకు గైర్హాజరైన మెడికల్ ఆఫీసర్‌ను సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించడం ఇందు కు ఉదాహరణ.నకిరేకల్ నియోజకవర్గంలో నకిరేకల్, రామన్నపేటల్లో ఏరియా ఆసుపత్రులు మినహాయిస్తే మొత్తం 08 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఆ పీహెచ్‌సీల పరిధిలో 37సబ్ సెంటర్లు ఉన్నాయి.వీటిల్లో చిట్యాల, కేతేపల్లి మండల కేంద్రాల్లో ఉన్న పీహెచ్‌సీలు 24 గంటల వైద్యసేవలందించే కేంద్రా లుగా పని చేస్తున్నాయి. 24గంటల పాటు సేవలందించే పీహెచ్‌సీల్లో ఇద్దరు చొప్పున మెడికల్ ఆఫీసర్లు ఉండగా మిగతా పీహెచ్‌సీలకు ఒకొక్కరు చొప్పున మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు.

ప్రధాన ఉద్యోగుల పట్టిక			
పోస్టుల పేరు	మంజూరు ఉన్న పోస్టులు	పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య	ఖాళీలు
మెడికల్ ఆఫీసర్	10	10	నిల్
సీహెచ్‌వో	08	05	03
హెల్త్ సూపర్‌వైజర్	22	19	03
స్టాఫ్ నర్సు	11	08	03
ఫార్మాసిస్టు	09	08	01
ల్యాబ్ టెక్నీషియన్	08	08	నిల్
ఏఎన్‌ఎంలు	105	94	11

ఏఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే..

ఆయా పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లున్నప్పటికీ కీలకమైన కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేతే పల్లిలోని పీహెచ్‌సీలో ఇద్దరు ఫార్మాసిస్టులు పని చేస్తున్నారు. అయినా దివ్యాంగురాలైన భీమారం రెండో ఏఎన్‌ఎంతోరోగులకు మందులు ఇప్పిస్తున్నారని తెలిసింది. ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు పగటి పూట మాత్రమే విధులకు హాజరవుతుండగా రాత్రి వేళ మాత్రం కేవలం స్టాఫ్ నర్సుతోనే సేవలను అందిస్తున్నారు. ప్రసూతి లాంటి అత్యవసర సేవలు పడితే కాల్ డ్యూటీ పేరిట డాక్టర్లు వస్తారని తెలుస్తుంది. కాగా నార్కట్‌పల్లి పీహెచ్‌సీలో కీలకమైన సీహెచ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. ఇంతకాలం ఇక్కడ పని చేసిన సీహెచ్‌వో గతనెల పదవీ విరమణ పొందారు. చిట్యాల మండల కేంద్రంలో గల 24 గం టల పీహెచ్ సీలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హెల్త్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉండగా ఈ పనిభారం మిగతా సిబ్బందిపై పడు తోంది. నకిరేకల్ మండలంలోని గోరెంక లపల్లిలో 2వ ఏఎన్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది. కట్టం గూర్ మం డలంలో 6 ఏఎన్‌ఎం, 1 హెల్త్‌అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రామన్నపేట మండలంలోని మునిపంపుల పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు ఖాళీగా ఉంది.

పీహెచ్‌సీల్లో సమస్యలు:

నార్కట్‌పల్లి పీహెచ్‌సీలో సిబ్బందికి రక్షిత మంచి నీటిని అందించే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రం రెండేళ్లుగా ఉత్సవ విగ్రహంగానే మిగిలింది. ఈ ఆర్‌వో సిస్టంకు నీటిని అందిం చేం దుకు ఎగువన ట్యాంకు లేకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది. కాగా సీసీ కెమెరాలకు సంబంధించి కూడా రీచార్జ్ బిల్లులను ఏండ్ల తరబడి ఇవ్వకపోవడంతో తమ జేబు నుంచి పెట్టుకోలేక సీసీ కెమెరాలను రీచార్జ్ చేయించడం లేదు. అక్కెనపల్లి పీహెచ్‌సీలో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. కాగా అన్ని పీహెచ్‌సీల్లో జనరేటర్లు ఏండ్ల తర బడి నిరు పయోగంగా పడి ఉన్నాయి. ఫ్రీజర్‌ల కోసం ఇన్వర్టర్లు ఉండటంతో వీటి వాడకం పూర్తిగా తగ్గింది.

ఆపరేషన్లు చేయడం లేదు ?

పీహెచ్‌సీల్లో ఆపరేషన్ థియేటర్లు ఉన్నా నియోజకవర్గవ్యాప్తంగా ప్రసూతి ఆపరేషన్లు ఎక్కడా చేయడం లేదని తెలుస్తుంది. ఏరియా ఆసుపత్రులు ఉన్న మండలాల్లో మాత్రం నెలలు నిండిన గర్భి ణులను పీహెచ్‌సీ సిబ్బంది ప్రసూతి కోసం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. సాధారణ కాన్పులు కూడా చేయడం లేదు. అలాగే గతంలో కుటుంబ నియంత్రణ కోసం ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయగా ఇపుడు అవి కూడా చేయడం లేదని తెలి సింది. దీంతో అన్ని పీహెచ్‌సీల్లో ఆపరేషన్ థియేటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఫలితంగా పీహెచ్‌సీలకు అందజేసిన జనరేటర్లు కూడా నిరుప యో గంగానే ఉన్నాయి. వ్యాక్సిన్లకు



పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

నిల్వచేసి భద్ర పరిచే ఫ్రీజర్లు ఒకవేళ కరెంటు పోయినా 24 గంటల పాటు కూలింగ్ వాతావరణాన్ని కలిగే ఉండటంతో సమస్య ఏర్పడటం లేదు.

సమయ పాలన పాటించాలి



అక్కెనపల్లి పీహెచ్‌సీ సిబ్బందిలో కొందరు సకాలంలో విధులకు హాజరు కావడం లేదు. సాయంత్రం 3గంటలకే కొందరు వెళ్లిపోతున్నారు. కొన్నిసారు మందులు స్టాకు లేవంటున్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి జరిగేలా డాక్టర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. - మాదాసు చంద్రశేఖర్ అక్కెనపల్లి

ఓపీ సంఖ్య పెరుగుతోంది



మా ఆరోగ్య కేంద్రానికి ఓపీ సం ఖ్య బాగానే పెరుగుతోంది. రోజుకు 70 మంది దాకా వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నా యి. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి టెస్టులను చేస్తున్నాం. ఉచితంగా మందులు ఇస్తున్నాం. క్రమం తప్పకుండా ఏఎన్‌సీ నిర్వహిస్తున్నాం. కానీ ప్రసూతి కోసం మాత్రం గర్భిణులు నల్లగొండ జీజీహెచ్‌కు వెళ్తున్నారు.
- విజయ్‌కుమార్, మండల వైద్యాధికారి, నార్కట్‌పల్లి

గ్రామ పోలీస్ అధికారులు వీరే..

శాలిగౌరారం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవ లను అందించడానికి జిల్లా ఎస్పీ ఆదేశానుసారం శాలిగౌరారం మండలంలోని అన్ని గ్రామాలకు పోలీస్ అధికారులను నియమించినట్లు శాలిగౌరారం ఎస్‌ఐ సైదులు తెలిపారు. కె.వెంకటయ్య(ఊట్కూరు), టి.సతీష్ (బండమీదిగూడెం), జె.శ్రీని వాసులు(అడ్లూర్), పి.సైదులు (శాలిగౌరారం),ఎ.మౌనిక (తిరుమలరాయిని గూడెం), సయ్యద్ నజీరుద్దీన్ (నూలగడ్డ కొత్తపల్లి),బి.విక్రమ్ (భైరవునిబండ),వి.సతీష్ (అంబారిపేట,తుడిమిడి), బి.లక్ష్మణ్ (చిత్తలూరు),టి.దేవేందర్ (ఆకా రం), వి.నాగయ్య (పెర్క కొండారం),వి.సతీష్ కుమార్ (వల్లాల),టి. శ్రీనివాస్ (జాలోని గూడెం),ఎం.రమేష్ (మాధారం),ఎల్.రవినాయక్ (తక్కళ్లపహాడ్),జె.శ్రీనివాస్ (శాలి లింగోటం, రామగిరి),జె.లింగయ్య (వంగమర్తి),ఎం.సునీత (ఇటుకుల పహాడ్), ఎం.జానయ్య (ఉప్పలంచ), వి.నర్సింహా (మనిమద్దె), జి.మనోహర్ (గురజాల), ఎన్.సునీల్ (రామాంజపురం) ప్రజలు గ్రామ పోలీస్ అధికారులకు తమ సమస్యలు చెప్పుకొని పరిష్కరించుకోవచ్చునని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపిక



మల్లేష్, మంజుల

శాలిగౌరారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం నుంచి పేద కుటుంబానికి చెందిన ఇద్దరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. మండలంలోని గుర జాల గ్రామానికి చెందిన నిమ్మనగోటి నర్సయ్య-లక్ష్మమ్మ కుమారుడు మల్లేష్ 50వ ర్యాంక్ ఊట్కూర్ గ్రామానికి చెందిన పెరుమాండ్ల వీరయ్య-సుశీల దంపతుల కుమార్తె మంజుల 165వ ర్యాంక్ సాధించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఎంపికయ్యారు. వీరిద్దరిని పలువురు వారిని అభినందించారు.

జనావాసాల నుంచి డంపింగ్‌యార్డు తరలిస్తాం

చిట్యాల, మార్చి18, (ఆంధ్రజ్యోతి) : చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో జనావాసాల మధ్య ఉన్న డంపింగ్‌యార్డును తరలిస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మంగళవారం శివనేనిగూడెం గ్రామ అఖిలపక్ష నాయకులు ఎమ్మెల్యే కలిసి డంపింగ్‌యార్డును తరలించాలనీ కోరారు. డంపింగ్‌యార్డు నుంచి వచ్చే పొగ, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీంతో ఎమ్మెల్యేమున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి జనావాసాలకు దూరంగా డంపింగ్‌యార్డు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మల్లెబోయిన మల్లేష్, చొప్పరి లింగస్వామి, బొబ్బల సైదులురెడ్డి, నాగిళ్ళరాజు, రుద్రవరం రవీందర్ పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామస్థులు మునిసిపల్ కమిషనర్ వీరేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

'డబ్బాలను తొలగించడం అన్యాయం'

నల్లగొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నల్లగొండ పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా ఎన్జీ కళాశాల ప్రహరీకి అనుకొని ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిరు వ్యాపారులను గుర్తించి వారికి దుకాణాలను కేటాయించామని ఆ దుకాణాల సముదాయాన్ని అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారని వివరించారు. మంగళవారం రాత్రి మునిసిపాలిటీ సిబ్బంది డబ్బాలను తొలగించారని ఇది ఏ అభివృద్ధికి నిదర్శమని ప్రశ్నించారు. తాము ఎంతో కష్టపడి నల్లగొండ అభివృద్ధి చేస్తే తన పేరుతో పాటు బీఆర్‌ఎస్ పేరు ఉండదని కాంగ్రెస్ పాలకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే గడి యారం సెంటర్‌లో రూ.95 కోట్లతో శంకుస్థాపన చేసిన ఆడిటోరియం పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. నల్లగొండ అభివృద్ధిని అడుకుంటున్న కాంగ్రెస్ పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వివరించారు.

అర్హులకే రాజీవ్ యువ వికాసం వర్తింపజేయాలి

గట్టుప్పల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని అరులైన నిరుద్యోగ యువతకు మాత్రమే వర్తింప చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లం మహేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం మొదటి మహాసభ పసుపుల ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 19 నుంచి 23 వరకు భగత్ సింగ్ స్మారక యువజన, విద్యార్థి ఉత్సవాలను నిర్వహి స్తున్నామని. ఈ యొక్క స్మారక ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కర్నాటి మల్లేశం, వెంకటేశం, సుధాకర్ పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

కేతేపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో గల బంగారు మైసమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పారాయణం, జలాధివాసం, మహిళా కుంకుమార్చన, నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలను పాలు, తేనె, నెయ్యి, నీరు, పుష్పాలతో అభిషేకించారు. ఆలయ ఆవరణలో దంపతులు యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. బుధవారం అమ్మవారికి బోనాల సమర్పణ, మొక్కుల చెల్లింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఉత్సవ నిర్వహకులు తెలిపారు. ఈ వేడుకల్లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముదిరెడ్డి యాగిరిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సోమసాని వెంకటరెడ్డి, కౌశిక్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసరెడ్డి, గుత్తా సైదిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూరు పశువుల సంత వేలం

కట్టంగూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పశువుల సంత, తైబజార్ వేలాన్ని ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో చింతమల్ల చలపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో ఐదుగురు పాల్గొనగా కట్టంగూరుకు చెందిన చెరుకు నర్సింహా రూ.31.80లక్షలు, తై బజార్ వేలంలో 8మంది పాల్గొనగా కట్టంగూరుకు చెందిన పంతంగి రాములు రూ.1.80 లక్షలకు పాటపాడి కైవసం చేసు కున్నట్లు పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ తెలిపారు.కార్యక్రమంలో కొంపల్లి యాదయ్య, రెడ్డిపల్లి మనోహర్, మునుగోటి ఉత్తరయ్య, చిత్తలూరి జానకి రాములు, యర్కల సత్తయ్య, కానుగు వెంకన్న, కాపుగంటి శ్రీను, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదలే కీలకం



శాలిగౌరారంలో కేజీబీవీలో ప్యాడులు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

శాలిగౌరారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధన సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మస్థైర్యం కీలకమని శాలిగౌరారం ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. మంగళవారం శాలిగౌరారం మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్, శాలిగౌరారంలోని కేజీబీవీ, అడ్లూర్, ఆకారం, వల్లాల జడ్పీ స్కూల్‌లో, జెఎంజే గీతాంజలి హైస్కూళ్లలో చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 270 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు, స్కేళ్లు ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో వల్లాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో నాగరాణి, గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ దొంతూరి పరమేష్, జెఎంజె స్కూల్ ప్రిన్సిపాల్ వెంగళి జానయ్య, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రసిడెంట్ డెంకల సత్యనారాయణ, మెంబర్ కప్పల శ్రీకాంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేష్ గౌడ్, నాయకులు చామల జైపాల్ రెడ్డి, తిరుపారి మల్లేష్ యాదవ్, ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, నాగయ్య పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి : మండలంలోని నెమ్మాని జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మేడి హరికృష్ణ పరీక్షా సామాగ్రిని మంగళ వారం అందజేశారు. కార్యక్రమంలో బుర్రి ఎల్లేశ్, హెచ్‌ఎం నీరజ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పద్మజ, మాధవీలత, పద్మావతి, అరుణ, నర్సింహ, శ్రీనివాస్, గోవర్ధనచారి తదిత రులున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం అభినందనీయం

రామగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : బీసీలకు రిజర్వేషన్లు 42శాతానికి పెంచడంతో పాటు, పార్లమెంట్‌లో 9వ షెడ్యూల్‌లో చేర్పించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన సైదులు అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని కొనియాడారు. బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ పెండం ధనుంజయ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో 50ఏళ్లుగా జరిగిన పోరాటం నేడు ఫలించిదన్నారు. సమావేశంలో ముంతాజ్ అలీ, జెర్రిపోతుల లింగయ్య, పొడిశెట్టి అరవింద్‌గౌడ్, నాగారాజు, మల్లయ్య ఉన్నారు.

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో..

నల్లగొండ : బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, బిల్లుకు మద్దతు పలికిన రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచుతూ చట్టం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలిజాల వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, గోన వెంకటేశ్వర్లు, రంగారావు, ప్రశాంత్, వేణు, కోటేష్, పవన్ కుమార్, సంతోష్, సాయి, అరవింద్ పాల్గొన్నారు.



నల్లగొండలో మిఠాయిలు పంపిణీ చేస్తున్న దీపేందర్, నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం.



కేతేపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ, ఎస్సీ నాయకులు

కేతేపల్లి, కట్టంగూరు: బీసీ రిజర్వేన్లు పెంచడం, ఎస్సీ వర్గీకరణ చట్టాలను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ బీసీ, ఎస్సీ నాయకులు మంగళవారం సాయంత్రం కేతేపల్లి, కట్టంగూరుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్ కేవలం బీసీలు, ఎస్సీలను మాయమాటలతో మభ్యపెట్టిందని విమర్శించారు. కేతేపల్లిలో మార్కెట్ డైరెక్టర్ బయ్య ముత్తయ్య, మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు మట్టి సాల్మన్, కోట పుల్లయ్య, అంజన్‌కుమార్, కత్తుల వీరన్న, ఎ.వీరాచారి, ఎస్.మంగమ్మ, ఎడ్ల ప్రవీణ్, కోట పూర్ణచందర్‌రావు, ఎ.వెంకట్‌గౌడ్, పి.సుధాకర్‌రెడ్డి, చింత ఆంద్రయ్య, డి.సంపత్ తదితరులు పాల్గొన్నారు. కట్టంగూరులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ సుంకంబోయిన నర్సింహా రెడ్డిపల్లి సాగర్, పట్టణాధ్యక్షుడు చెరుకు యాదగిరి, మాజీ సర్పంచ్‌లు శ్రీను, సైదులు, మాజీ జడ్పీటీసీలు పెద్దరాములు, బిక్షం, నర్సింహ్మా, పరమేశ, బండారు కృష్ణ, నాయకులు మిట్టపల్లి శివ, యాదయ్య, రామకృష్ణ, అంజన్ కుమార్ ఉన్నారు.

నేడు ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కనగల్, మార్చి 18.(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని బుధవారం లెక్కిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జెల్లపల్లి జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలి

నల్లగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తున్న ఉద్యోగాలన్నింటిని ఎస్సీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ ఆధ్వర్యంలో 8వ రోజు దీక్షలు కొనసాగాయి. కార్యక్రమంలో కొమిరె స్వామి, బొజ్జ దేవయ్య, కురుపాటి కమలమ్మ, ఏడుకొండల్, హరిప్రసాద్, నాగరాజు, వెంకన్న, బాబు, కృష్ణ పాల్గొన్నారు.

బెంచీలు బహూకరణ

చిట్యాలరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలం పెద్దకాపర్తి ప్రాథమిక పాఠశాలకు జడ్పీహెచ్‌ఎస్ 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు రూ. 20వేల విలువ గల బెంచీలను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాలకు తోడ్పాటు అందించాలనే బెంచీ లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్ ఉపాధ్యాయులు శ్రీధర్, బుంగపట్ల తిమ్మయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ వైస్ చైర్మన్‌కు పరామర్శ

నార్కట్‌పల్లి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయితరాజు యాద య్యను టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటేశ్, నకిరేకంటి జాని, మునగాల సాయికుమార్, సాయి ఉన్నారు.

చిన్న మాదారంలో విషాదఛాయలు


కనగల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమాదారం గ్రామానికి చెందిన వట్టికోటి ఎల్లేష్(37) దుప్పలపల్లి వద్ద రైలు కింద పడి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఎల్లేష్ అందరితో కలివిడిగా ఉండేవాడని బంధువులు వివరించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

కట్టంగూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల కు వీడ్కోలు సమావేశంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి అంజయ్య పాల్గొని మాట్లాడారు. ప్రతి వ్యక్తి జీవితంలో అభివృద్ధి సాధించాలంటే చదువు ఒకటే మార్గమని కష్టంతో ఇష్టపడి చదివిన వారు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారన్నారు. ఉన్నత చదువులు చదవడానికి పదవ తరగతి కీలకమని విద్యార్థులు పట్టుదలతో పరీక్షలు రాసి నూరుశాతం ఉత్తీర్ణత సాధిం చాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, కుటుంబ సభ్యులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి ంచారు. ఉపాధ్యాయులు మహాలక్ష్మి, అంథోని, సునంద, విఠల్ కుమార్, గఫూర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ నేతల ముందస్తు అరెస్టు

మునుగోడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ రద్దు చేయాలని బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆ సంఘం నాయకులను పోలీసులు మును గోడు, నాంపల్లి, నార్క ట్‌పల్లి మండలాల్లో ముందస్తుగా అరెస్ట్ చేశారు. మునుగోడులో బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బంగారు రవి, ఓరుగంటి శంకర్, బండారు శ్రీను, ఎల్లంకి శ్రీశైలం, పందుల సురేష్, నాంపల్లిలో నేరళ్ల సైదులు, నాంపల్లి భిక్షం, గంజి సంజీవ, కస్తూరి రాము, నార్కట్‌పల్లిలో దుబ్బాక శ్రీధర్, పుల్లెంల వెంకట్, నడింపల్లి నరేశ్, వడ్డేపల్లి నాగరాజు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. అనంతరం వారిని సొంత పూచీకత్తు విడిచిపెట్టారు.



మునుగోడులో అరెస్టు అయిన నేతలు

సంక్షిప్తంగా

● మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి, తానేదార్‌పల్లి, లెంకలపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో మున్నయ్య మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం కూలీలకు రూ.300 ఇస్తుందని అందుక కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఏర్పుల యా దయ్య, యాదాచారి ఉన్నారు.


● మర్రిగూడ : మసీదు ఆవరణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజు సూచించారు. మంగళవారం రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రశాంతంగా మసీదులలో ప్రశాంత నమాజ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా అపరిచితులు వస్తే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యుడు యాకుబ్, యూసుఫ్, సలీం, రంజాన్ ఉన్నారు.

● నల్లగొండ : జిల్లా స్థాయిలో గణితం పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మేడి సాక్షికి మంగళవారంఅవార్డును అందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన మేడి సాక్షి రామానుంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో ఫౌండేషన్ నిర్వహకుల చేతుల మీదుగా అవార్డును అందుకున్న సందర్భంగా పలువురు అభినందించారు.

● కేతేపల్లి : సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నాయకులు మంగళవారం మండలంలోని కొప్పోలు గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు తెలుసు కున్నారు.ఈ సందర్భంగా స్థానికుల విజ్ఞప్తి మేరకు కొప్పోలు ఆవాసగ్రామంగా ఉన్న చౌళ్ల గూడెంలోని ప్రభుత్వ భూమిలో 3ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించి అందులో పార్టీ జెండాలు పాతారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, లూర్దుమారయ్య, నాయకులు కర్ర బాలయ్య, సత్తిరెడ్డి, వెంకన్న, వెంకన్న పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్ : మండలంలోని నేరడ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మండల కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య మాట్లాడుతూ ఊర కుంటలోకి వెళ్లాల్సిన కాల్వలో మట్టికట్ట అడ్డుగా వేయడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కవిటీ సభ్యుడు కందగట్ల గణేష్, కల్లూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్ : మండలంలోని నేరడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల తల్లులకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ గడ్డం ప్రదీప్‌కుమార్, లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ అధ్యక్షురాలు యాస సరళ ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందించ నున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెల్ల ఇందిర, శారద, మామిడిపల్లి దీపిక, శిక్షకురాలు ఇందిర, యాస వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 | కనిష్ఠం 19.4



భువనగిరి ఖిల్లా

ఉమ్మడి జిల్లా పర్యాటకానికి
రోప్‌వే తోరణం

- రాష్ట్రంలో మొట్టమొదటి రోప్‌వే
- భువనగిరి ఖిల్లాపైకి నిర్మాణానికి రూ.56.81 కోట్లతో టెండర్
- యాదగిరిగుట్ట, నల్లగొండలోని హనుమాన్‌కొండ, నాగార్జునసాగర్ రోప్‌వేలకు ప్రతిపాదనలు

భువనగిరి టౌన్,మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నో చారిత్రక, పురాణ, రాజవంశాల పాలన ఆనవాళ్లతో పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న ఉమ్మడి జిల్లా మరింత పర్యాటక శోభను సంతరించుకోనుంది. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకానికి పెరుగుతున్న ప్రాధాన్యం నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి జిల్లాపై దృష్టిసారించాయి. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ 2.0 పథకానికి ఎంపికైన చారిత్రక భువనగిరి ఖిల్లా అభివృద్ధి, రోప్‌వే నిర్మాణానికి రెండు రోజుల క్రితం పర్యాటకశాఖ రూ.56.81కోట్లతో టెండర్లు పిలిచింది. అలాగే లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సందర్శనకు యాదగిరిగుట్టపైకి, నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌కొండకు, నాగార్జునసాగర్ ఆనకట్ట మీదుగా రోప్‌వే నిర్మాణానికి పర్వతమాల పథకంలో నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇప్పటికే భువనగిరి ఖిల్లాపైకి రోప్‌వే నిర్మాణానికి టెండర్లు పిలవగా మిగతా మూడు ప్రతిపాదనలకు కూడా కేంద్రం ఆమోదం తెలిపితే ఉమ్మడి జిల్లాలో నిర్మించే రోప్‌వేలు రాష్ట్ర పర్యాటకానికి తోరణాలు కానున్నాయి.

ఎట్టకేలకు ఖిల్లా పనులకు టెండర్లు

భువనగిరి ఖిల్లా అభివృద్ధి కోసం పర్యాటకుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరనుంది. ప్రధాని మోదీ 2.0 ప్రభుత్వంలో కేంద్ర పర్యాటకశాఖ క్యాబినెట్ మం త్రి హోదాలో సుమారు నాలుగేళ్ల క్రితం తొలిసారిగా భువనగిరి పర్యటనకు వచ్చిన నేటి ఉక్కుశాఖ మంత్రి నాడు జరిగిన బహిరంగ సభలో భువనగిరి....

- మిగతా 7వ పేజీలో...



ఉద్యమాలే మాకు
ఉగ్గుపాలు

గెరిల్లా శిక్షణ తీసుకొని సాయుధ పోరాటంలో రజాకార్లను గడగడలాడించిన ధీరవనిత.. శత్రువుల కళ్లుగప్పి ఉద్యమాన్ని ముందుకు నడిపిన వ్యూహకర్త.. సొంతంగా పాటలు అల్లి మహిళలను ఉద్యమంవైపు మళ్లించిన చైతన్యదీప్తి.. మహిళా సంఘం నేతగా.. ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజలతో మమేకమై ఉద్యమాలకే జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి మల్లు స్వరాజ్యం. ఆమెకు ముగ్గురు పిల్లలు. కుమారులు మల్లు గౌతంరెడ్డి, మల్లు నాగార్జున్‌రెడ్డి, కుమార్తె పాదూరి కరుణ. ఇద్దరు కుమారులూ కమ్యూనిజం బాటలో పయనిస్తుండగా, ఆమె కోడలు మల్లు లక్ష్మి సైతం అదే బాటను అనుసరించారు. బుధవారం మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా ఆమె పిల్లలను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. స్వరాజ్యం ఉద్యమ గాథలు, ఆమెతో అనుబంధాలను వారు పంచుకున్నారు. • 6లో..



బడ్జెట్‌వైపే అందరి చూపు

- రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం ఉంటుందనే ఆశాభావం
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులపై స్పష్టత వచ్చే అవకాశం
- ఏఎమ్మార్పీ కెనాల్ లైనింగ్, ఏదుల-డిండికి నిధులిస్తారనే చర్చ
- లిఫ్టులు, మూసీకాల్వలకు దండిగా నిధులొస్తాయనే సంకేతాలు
- ఎంజీయూ అభివృద్ధి పనులకు రూ.309కోట్లతో ప్రతిపాదనలు
- మహిళా సంఘాలకు రైస్‌మిల్లులపై ప్రకటన

అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టే 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టే ఈ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ఆకాంక్షలకు అనుగుణంగా నిధుల కేటాయింపులు ఉంటాయని అంతా భావిస్తున్నారు. మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సైతం జిల్లాలో, నియోజకవర్గాల్లో పర్యటించిన పలు సందర్భాల్లో ప్రాధాన్య ప్రాజెక్టులకు, పథకాలకు నిధులిప్పిస్తామని ప్రకటించడంతో ఆ మేరకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 4లక్షల ఎకరాలకు సాగునీరందించే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు (శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగమార్గం ప్రాజెక్టు)కు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి గత బడ్జెట్‌లో రూ.799కోట్ల నిధులు కేటాయించింది. అంతేగాక గ్రీన్‌చానల్ ద్వారా నిధులివ్వాలని కూడా నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు పనులను ఫిబ్రవరిలో ప్రారంభించగా, దురదృష్టవశాత్తు టన్నెల్ కూలి ఎనిమిదిమంది కార్మికులు గల్లంతవగా, పనులకు బ్రేక్‌పడింది. ఈ నేపథ్యంలో గత 26 రోజులుగా టన్నెల్‌వద్ద రెస్క్యూ ఆపరేషన్ జరుగుతుండగా, ఈ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టు పనుల కొనసాగింపు,రెస్క్యూ ఆపరేషన్, రీడిజైన్ తదితర అంశాలపై ఈ బడ్జెట్‌లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వైద్యరంగానికి భారీగా నిధులిచ్చే అవకాశం...

పేదలకు నాణ్యమైన వైద్య అందించేందుకు ఈ బడ్జెట్‌లో నిధులిస్తారని భావిస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయాల్సి ఉంది. మోత్కూరు, మునుగోడు పీహెచ్‌సీలను 30పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేసి నిధులిస్తారని భావిస్తున్నారు. వీటితో పాటు జిల్లా కేంద్రాల్లోని జనరల్ ఆస్పత్రులకు నిధులతో పాటు, ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టుల నియామకానికి ప్రకటన చేస్తారని ఆశాభావం వెల్లడవుతోంది. నల్లగొండ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు భరోసా..

- మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో కీలకమైన మరో సాగు నీటి ప్రాజెక్టు డిండి ఎత్తిపోతల పథకం పూర్తికి ఈ బడ్జెట్‌లో సమగ్రంగా నిధులు కేటాయిస్తారని అంచనావేస్తున్నారు. ఈ పథకంలో కీలకమైన ఏదుల-డిండి అనుసంధానం పనులు రూ.2,400కోట్లతో చేపట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులివ్వగా, ఈ బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. అదేవిధంగా డిండి ఎత్తిపోతల పథకం కింద ఉన్న ఏడు రిజర్వాయర్లకు, వాటి పరిధిలోని కాల్వల నిర్మాణాలకు ఈ బడ్జెట్‌లో

డిండి-ఏదుల అనుసంధానానికి నిధులు!

తగిన కేటాయింపులు చేయనున్నారు. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.300కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. వీటితో పాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణ పెండింగ్ పనులతో పాటు, ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన చిన్న ఎత్తిపోతల పథకాల పూర్తికి, పాత లిఫ్టుల ఆధునికీకరణ, నిర్వహణకు ఈ బడ్జెట్ ద్వారా నిధుల కేటాయింపు ఉంటుందని భావిస్తున్నారు.

వీటితో పాటు బునాదిగానికాల్వ, పిల్లాయిపల్లి కాల్వ, బెండలమ్మచెరువు, శేషలేటివాగు ఫీడర్ ఛానల్, కొండాపురం ఫీడర్‌చానల్ నిర్మాణాలకు నిధులిస్తారనే నమ్మకం కనిపిస్తోంది. గంధమళ్ల రిజర్వాయర్ నిర్మాణంతో పాటు, బస్వాపూర్ రిజర్వాయర్ ముంపుగ్రామాలకు పరిహారం ప్రకటిస్తారని తెలుస్తోంది. మరోవైపు శ్రీరాంసాగర్ రెండో దశ చివరి ఆయకట్టు భూములకు నీరందించేందుకు కాల్వల ఆధునీకరణకు నిధులివ్వాలనే డిమాండ్‌కు మోక్షం లభించాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.



• ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రపంచ సుందరి

ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరీశుడి ఆలయాన్ని మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా మంగళవారం దర్శించుకున్నారు. సంప్రదాయ చీరకట్టులో తిరువీధుల్లో అఖండ దీపారాధన చేసి కొబ్బరికాయ సమర్పించి సనాతన హిందూ ధర్మం, ఆలయ విశిష్టత, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం మొత్తం కలియతిరిగి శిల్పకళా సౌందర్యాన్ని ప్రశంసించారు. ఆమెకు ఆలయ పండితులు ఆశీర్వచనం చేశారు. - ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట

• సీఎంకు కృతజ్ఞతలు



ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపిన సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం

ఓటుకు ఆధార్ అనుసంధానం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నిడమనూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటుకు ఆధార్ కార్డు అనుసంధానం చేయనున్నట్లు అదనపు కలెక్టర్, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఈఆర్‌వో జే. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటుకు ఆధార్‌కార్డును కచ్చితంగా అనుసంధానం చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందని తెలిపారు. 2025 ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మృతిచెందిన వారి, పెళ్లి చేసుకుని వెళ్లిపోయిన వారిని, రెండు ఓట్లు ఉన్న వారిని ఓటరు జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఆర్ఐ దాడి రాజిరెడ్డి, సందీప్, ఆయా పార్టీల నాయకులు అంకతి సత్యం, ముంగి శివమారయ్య, బొల్లం రవి, కొండేటి శ్రీను, కొమాండ్ల గుర్వయ్య, ఎదుళ్ల వినీల్ రెడ్డి, మంద తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కారోబార్‌తండాలో సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి,మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంపు వల్ల ముంపునకు గురవుతున్న వద్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్‌తండ గ్రామంలో మంగళవారం జిల్లాకు చెందిన ఎస్‌డిసికార్యాలయ ఆర్ఐఅశ్విని ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. గిరిజనులు పునరావాసం కింద నిధులు మంజూరు పారదర్శకంగా జరగాలని, తడావాసులందరికీ నిబంధనల ప్రకారం నిధులు మంజూరు చేయాలని తండావాసులు సర్వే అధికారులను కోరారు. కార్యక్రమంలో రాంమూర్తి, కార్యదర్శి శిరీష, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



చందంపేట కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం మార్కెట్‌కు రానున్న నేపథ్యంలో ధాన్యం సేకరణకు పౌరసరఫరాలు, వ్యవసాయ అనుబంధ శాఖలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ధాన్యం సేకరణ, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు ఉదయాదిత్య భవన్‌లో శనివారం నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. ధాన్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రేడ్ ఏ రకానికి రూ.2,320లు, సాధారణ రకానికి రూ.2,300ల మద్దతు ధర ప్రకటించాయన్నారు. సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ప్రకటించినట్లు తెలిపారు. ఈసంవత్సరం యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2లక్షల హెక్టార్లు సాగైందని, 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశముందని అంచనా వేసినట్లు తెలిపారు. మార్కెట్‌కు 11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో మిల్లర్లు 5,68,152మెట్రిక్ టన్నులు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ద్వారా 5,57,869 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. సిబ్బంది కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డీసీవో పత్యనాయక్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఛాయదేవి పాల్గొన్నారు.

నల్లగొండ బైపాస్ జాతీయ రహదారి 565కు సంబంధించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నేషనల్ హైవే 565 నల్గొండ బైపాస్‌పై జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు, రెవెన్యూ అధికారులతో మంగళవారం తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. స్ట్రక్చర్లు, ఇతర నిర్మాణాలను సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జాతీయ రహదారుల సంస్థ విశ్రాంత భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, జాతీయ రహదారుల సంస్థ ధర్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్, నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పంతులమ్మగా మారి.. పాఠాలు బోధించి..

చందంపేట: మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు గణితం బోధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. 10వ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజ నం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఆడ పిల్లలను భారంగా కాకుండా బాధ్యతగా పెంచాలన్నారు. గర్భంలోనే ఆడ శిశువులను చంపే సంస్కృతిని విడనాడాలన్నారు. అంతకుముందు పీహెచ్‌సీని తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉందని మండల వైద్యాధికారి చందులాల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీలక్ష్మీ తదితరులు ఉన్నారు.

ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



అవురవాణిలో ఎండిన వరిచేలను పరిశీలిస్తున్న నారి అయిలయ్య

నార్కట్‌పల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి పథకం కింద కూలీలతో పనిచేయిస్తున్న ప్రదేశాల్లో నీరు-నీడ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అవురవాణి గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పథకం పనులు చేస్తూ వడదెబ్బకు గురై చనిపోయే వారికి రూ.20లక్షలను నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేయాలన్నారు. నీడ కోసం టెంట్, దాహర్తి తీర్చడం కోసం నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటల లోపే పని ముగించేలా వేళల్లో మార్పు చేయాలన్నారు. కనీసం కూలి రూ.800లు వచ్చేలా చూడాలని కోరారు. సాగునీరు లేక ఎండిపోయిన వరి పొలాలకు ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం నాయకుడు చెర్కు పెద్దులు, రైతు సంఘం జిల్లా నాయకుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, దోటి రేణుక, పార్వతమ్మ,నర్సింహ్మ, అలివేలు, ప్రేమలత, ఎల్లమ్మ, లింగమ్మ, సాలమ్మ తదితరులున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (బుధవారం సాయంత్రం) | సహర్: 5:00 (గురువారం ఉదయం)

ఆయకట్టు చివరకు నీరందించాలి



రైతులతో మాట్లాడుతున్న మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్

గుర్రంపోడు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ చివరి ఆయకట్టు వరకు నిరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ సూచించారు. మండల పరిధిలోని డీ-25 కాల్వను మంగళవారం పరిశీలించారు. ఆయకట్టు చివరి మారేపల్లి ప్రాంతానికి నీరు చేరేలా తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. 18 కిలోమీటర్ల పొడవునా గల డీ-25 కాల్వలో చివరి ఆయకట్టుకు నిరందించేందుకు కాల్వ ప్రారంభం నుంచి రైతులు అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న గండ్లు, పైపులన్నింటినీ తొలగించాలని ఆదేశించారు. అడ్డుపడితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుర్రంపోడు డివిజన్ ఈఈ నెహ్రూనాయక్, డీఈ పరమేష్, సురేష్‌కుమార్, ఏఈ శ్రీనివాసరావు, చంద్రప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

మిర్యాలగూడ: అదనపు ఓట్ల తొలగింపునకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారు. ఫాం-6, 7, 8లలో తలెత్తిన సమస్యల పరిష్కారంతో పాటు డుప్లికేట్ ఓట్లను తొలగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, కమిషనర్ యూసుఫ్ పాల్గొన్నారు.

నీటిని అడ్డుకోవద్దు

హాలియా: డీ-25 కాల్వ పైభాగంలో సాగు చేస్తున్న రైతులు దిగువకు రాకుండా నీటిని అడ్డుకోవడం సరికాదని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ అన్నారు. అనుముల మండలంలోని మారేపల్లి రైతులతో కలిసి డీ-25 కాల్వను మంగళవారం పరిశీలించారు. కాల్వలో ప్రవహిస్తున్న నీటిని ఎవరికి వారు అడ్డుకొని మళ్లిస్తే చివరి రైతులకు ఇబ్బంది అవుతుందన్నారు. ఇరిగేషన్ అధికారులు కాల్వను పర్యవేక్షించాలని సూచించారు. నిబంధనల ప్రకారం తూముకు సరిపడా నీరు వస్తుందన్నారు. ఆయన వెంట ఈఈ నెహ్రూ, డీఈ పరమేష్, తహసీల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, ఎస్ఐ సతీష్‌రెడ్డి, ఏవో సరిత పాల్గొన్నారు.

ఢిల్లీ తరలిన ఎల్ఐసీ ఏజెంట్లు

మిర్యాలగూడ టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఎల్ఐసీ ఏజెంట్లు మంగళవారం ఢిల్లీ తరలివెళ్లారు. సంఘ జాతీయ నాయకులు రాపోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలసీదారులకు బీమా సేవలందించే ఏజెంట్లను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. రోజురోజుకూ మారుతున్న ఐఆర్డీఏ నిబంధనలు సడలించాలన్నారు. కార్యక్రమంలో వేదమూర్తి, సైదిరెడ్డి, శ్రీనివాస్, కర్నాటి శేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

వీటీనగర్‌లో నేడు శ్రీవారి రథోత్సవం

చింతపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్ కొండపై బుధవారం శ్రీవారి రథోత్సవం వైభవంగా నిర్వహించడానికి మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. రథోత్సవాన్ని వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి భక్తుల రాక కోసం రోడ్డు వెడల్పు పనులు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్ కోరారు.

వసతుల కొరత.. తప్పని వెత

● దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో సమస్యలు ● ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో కాలం వెళ్లదీత



దేవరకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి రోజుకు 800నుంచి వెయ్యి మంది రోగులు వస్తుంటారు. నెలకు 160 నుంచి 180వరకు కాన్పులు జరుగుతాయి. దేవరకొండ డివిజన్‌తో పాటు సరిహద్దు జిల్లా నాగర్‌కర్నూల్ నుంచి కూడా రోగులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుంటారు. రోగులకు సరిపడా పడకలు లేకపోవడం, సకాలంలో వైద్యసేవలు అందకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. వంద పడకల నుంచి 200పడకల ఆసుపత్రి మంజూరైందని ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నా అది స్థల సేకరణకే పరిమితమైంది. ఆరు నెలల క్రితం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన రాములునాయక్ కల్వకుర్తి ఆసుపత్రికి బదిలీ కావడంతో మొదట సీనియర్ డాక్టర్ మంగ్తానాయక్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. జనవరిలో సీనియర్ డాక్టర్ రవి ప్రకాష్‌కు ఇన్‌చార్జి సూపరింటెడెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. పేషంట్లతో ప్రభుత్వ ఆసు పత్రి రద్దీగా ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓపీ వైద్యసేవలు అందించాల్సి ఉంది.

ఇటీవల ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డెంటల్ డాక్టర్ ఉన్నా డెంటల్ చైర్ లేకపోవడంతో దంత వైద్యానికి వచ్చే రోగులకు వైద్యం అందడంలేదు. దంత చికిత్స కోసం వచ్చేవారు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించే పరి స్థితి ఏర్పడింది. ఆసుపత్రిలో మంచినీటి బోరు అరకొరగా నీరు సరఫరా చేస్తుంది. దీంతో రోగులకు నీరు సరిఫడకపోవడంతో ఈ నెల 17న ఆసు పత్రి ఆవరణలో బోరు వేయడంతో ఆసుపత్రిలో నీటి సమస్య పరిష్కారం కానుంది. పేషంట్‌లకు సహాయకులుగా వచ్చేవారి కోసం ఆసు పత్రి ఆవర ణలో షెడ్‌లు ఏర్పాటు చేసి వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నా రు. ఆసుపత్రిలో 18 మంది వైద్యులు, 40మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

200 పడకలు ఏర్పాటు చేయాలి



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి. సకాలంలో వైద్యం అందక రోగులు ఇబ్బందులుపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. అన్ని రకాల వైద్యసేవలు, సరిఫడా మందులు పంపిణీ చేయాలి.

నూనె రామస్వామి, దేవరకొండ.

రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు



దేవరకొండ ఆసుపత్రిలో డాక్టర్‌లు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో ఇటీవల మంచినీటి బోరు వేశాం. దీంతో మంచినీటి సమస్య పరిష్కారమైంది. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. అన్ని రకాల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి.

● డాక్టర్ రవిప్రకాష్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్.

గత మూల్యాంకనం డబ్బులు చెల్లించాలి

హాలియా, మార్చి18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నా గత సంవత్సరం 2024లో ఎస్ఎస్‌సీ పరీక్ష పేపర్లు మూల్యంకనం చేసిన ఉపాధ్యాయులకు రేమ్యూనరేషన్ ఇంకా విడుదల చేయలేదని జిల్లా కోశాధికారి రాజు అన్నారు. హాలియా ఉపాధ్యాయుల మండల కమిటీ సమావేశంలో మంగళవారం మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ లోపు రెమ్యూనిరేషన్ చెల్లించకుంటే డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, అవసరమైతే పదో తరగతి మూల్యంకనాన్ని బహిష్కరిస్తామన్నారు. వెంటనే ఉపాధ్యాయులకు రేమ్యునిరేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచమల్ల రమావేది, నాయకులు చింతపల్లి రవీందర్, సయ్యద్‌మియా తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు



వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

మిర్యాలగూడ రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో లావూరి బాలు అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, విద్య విలువైన సంపద అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, ఉమామహేశ్వర్, శేఖర్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, రాము, వెంకటరత్నం, సైదయ్య, విజయ, పుష్ప ఉన్నారు.

రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలి



సర్వే నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మాడ్గులపల్లి, మార్చి 18(ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. సీపీఎం ప్రజా పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోపుచర్ల గ్రామంలో మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు రైతు భరోసా నిధులు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో పతాని శ్రీను, కేసాని లక్ష్మయ్య, మునగాల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీఎం రమేష్‌బాబు

దేవరకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులందరూ క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ విజయ సూచించారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్టీసీ డిపోలో మంగళవారం క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి నిర్ధారణకు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, వైద్యాధికారులు మహ్మద్, సఫియాబేగం, విజయప్రసాద్, కలీం ఉన్నారు.

ఓటరు జాబితాను సరిచూసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పు, ఒప్పులను సరి చూసుకోవాలని ఆర్డీవో రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా, దాని సమర్పణ నిరంతర నవీకరణ అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చు నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్, వివిధ పార్టీల నాయకులు వస్కుల సుధాకర్, ఎండి. యూనుస్, వేముల రాజు, నల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతులను ఆదుకోవాలి

మాడ్గులపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుర్రప్పగూడెం గ్రామంలో పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఎండిపోయిన పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతులకు నీరందించకుండా, డి-40 కాల్వ ద్వారా చెరువులను నింపితే భూగర్భజలాలు వృద్ధి చెంది రైతులు పంటలను కాపాడుకునేవారన్నారు. సరైన కరెంట్ కల్పించకపోవడం మూలంగా పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. డి-40 కాల్వ ద్వారా పానగల్లు ఉదయం సముద్రం నుంచి నీటిని అందించి రైతులను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, గుడుకుంట్ల సాయన్న, నాయకులు బొమ్మకంటి నరసింహ, రాచకొండ దశరథ, కడియం సైదులు, నాగరాజు, పల్నాటి రాంరెడ్డి, పోరెడ్డి సత్యనారాయణరెడ్డి, గుండా వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే క్రిమినల్ కేసులు

చింతపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాలను, అధికృత డీలర్లు కాకుండా ఇతరులు రేషన్ బియ్యం తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎం. రఘునందన్ హెచ్చరించారు. చింతపల్లిలోని రేషన్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన పంపిణీ చేయకున్న వారిని గుర్తించి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీటీడీవో ఎస్పీ రాజ్‌కుమార్

పెద్దవూర, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆత్మ విశ్వాసంతో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని డీటీడీవో ఎస్పీ రాజ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన ఏసీఎంవో డీ.వినాయక్‌తో కలిసి పాల్గొని అవగాహన కల్పించారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలో మంచి మార్కులు రావడానికి ఏ విధమైన టిప్స్‌ను అనుసరించాలనే గైడెన్స్, పరీక్షలు భయంతో కాకుండా ఆత్మ విశ్వాసంతో సన్నద్ధమై బాధ్యతతో రాయాలన్నారు. పదో తరగతి తర్వాత ఏ విధమైన కెరియర్స్ ఎంచుకోవాలి, అందుబాటులో ఉన్న విద్య, ఉద్యోగ అంశాలను ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో కాంపిటీటివ్ స్పిరిట్‌తో విద్యార్థుల అవసరాలను, ఆసక్తులను, సామర్థ్యాలను, అర్హతలను అనుసరించి భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.బాలోజీనాయక్, వసతిగృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, చలకుర్తి, పులిచెర్ల హెచ్‌డబ్ల్యూవోలు సుధాకర్, శ్రీనివాస్, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ కె.రాంరెడ్డి, బిక్షపతి సైదులు, సురేందర్, శాంతి, రామయ్య, సాంబయ్య, నాగేందర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న పీడీ నవీన్‌కుమార్

చింతపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని అడిషనల్ పీడీ నవీన్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని మంగళవారం ప్రజావేదికలో 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డుతో పాటు జాబితాలో నమోదైన పేర్ల ఆధారంగా ఉపాధిహామీ పనులు నిర్వహించాలన్నారు. పనుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకంగా పనులు కల్పించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్టిలో ఉంచుకొని తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేసుకొని పనులు నిర్వహించేందుకు సిబ్బంది చొరవ తీసుకోవాలన్నారు. వీధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్, దేవర కొండ క్లస్టర్ ఈపీడీ డాక్టర్ యామిని, పసివుద్దీన్, ఎంపీడీవో సుజాత, ఏపీవో శౌరిరెడ్డి, ఈసీ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

నిడమనూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లక్ష్యంతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీడీవో గుర్రం వెంకటేశం, ఎంఈవో లావూరి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు కూడా కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. లక్ష్యం సాధించడానికి విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొని నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, ఎస్ఐ గోపాల్‌రావు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గౌతమ్, ఎస్‌బీఐ మేనేజర్ దీప్తి, వైద్యాధికారి అరవింద్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న అధికారులు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



దేవరకొండ, చందంపేటలో పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు

దేవరకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ప్రభుత్వం ఉద్యమాలను ఆపలేదని బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. చలో అసెంబ్లీకి బయలు దేరిన నాయకులను పోలీసులు దేవరకొండలో మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణలు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం విడుదల చేశారు.

చందంపేట: రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో ఫీజుల బకాయిలను విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న చందంపేట మండల బీఆర్ఎస్వీ నాయకులను మంగళవారం చందంపేట మండల పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు జబ్బు శ్రీశైలం మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించవలసిన ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులతో కలిసి ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. అరెస్టయినవారిలో శేఖర్, గోసుల శివ, శ్యాం, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం



తీదేడులో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీదేడు(వెంకటంపేట)లోని రామలింగేశ్వరస్వామి రథోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహలను గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. రథోత్సవం ముందు రథాంగబలి హోమం భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం భక్తులు ఓం నామశివయ అంటూ రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, తదితర పట్టణాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కాయితి జితేందర్ రెడ్డి, దాసరిశ్రీనివాస్ యాదవ్, కొరివి యాదగిరి, కలగొని యాదగిరి, కాయితి బుచ్చిరెడ్డి, ముర్రు పాండురంగారావు, గొడుగు సత్తయ్య, సోనాగంటి గోవర్ధన్‌చారి, తిరుమని పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు ఇప్పటికైనా రెమ్యూనరేషన్ చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసచారి డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఏడాది గడిచినా ఇప్పటి వరకు గత రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 20న డీఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ సభ్యులు సపావత్ భానుప్రకాష్, శ్రీదేవి, కోడి నరేంందర్, శోభారాణి, నజీరుద్దీన్, నాగార్జున, సుధాకర్, కోటయ్య, శవంకరయ్య, మధుసూదన్, ఎకాంంత్ తదితరులు పాల్గొన్నారు.

తీదేడులో హోలీ వేడుకలు

చింతపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆనాటి ఆచార సంప్రదాయ ప్రకారం మండలంలోని తీదేడులో మంగళవారం ప్రజలు హోలీ ఉత్సవాలు జరుపుకున్నారు. రామలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని పూర్తయ్యాక హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రథోత్సవం తర్వాత హోలీ నిర్వహించారు.

పాఠశాలకు ఫ్యాన్ బహూకరణ

కొండమల్లేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలకు చంద్రన్న ఫౌండేషన్ సభ్యుడు హన్మంతు సాయిచంద్రగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యాన్ బహూకరించారు. ముున్ముందు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పున్న మల్లీశ్వరి, సభ్యులు కొమ్మనేని ఆంజనేయులు, గిరి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా పోరాడాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

నిడమనూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా యువత పోరాడాలని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను మంగళవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. సమాజంలో యువతను పీడిస్తున్న మత్తు పదార్థాలను తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మల్లికంటి చంద్రశేఖర్, కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, కొమాండ్ల గుర్వయ్య, బాలనారాయణ, శేఖర్, మహేష్, వుల్లయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

తిరుమలగిరి(సాగర్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొనమంచలి శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి విదార్థుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృతయ్య, లక్ష్మీరామ్, సాయిబాబా, రాము, సరోజినిదేవి, గౌసియా, అనిత, శైలజ, వినయ్‌కుమార్, భాను, కుమారస్వామి, సీఆర్పీ నాగయ్య, అటెండర్ జానిపాషా పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా ఎంపిక



శివకుమార్

కొండమల్లేపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదయ్య, యాదమ్మ దంపతుల పెద్దకుమారుడు బొడ్డుపల్లి శివకుమార్ సోమవారం టీజీపీఎస్‌సీ ప్రకటించిన హాస్టల్ వెల్ఫేర్ గ్రేడ్-2 ఫలితాలలో 5వ జోన్‌లో 300 మార్కులకు 205 మార్కులు సాధించి 12వ ర్యాంక్‌తో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. శివకుమార్ తమ్ముడు కూడా ఇటీవల ఏఈ ఉద్యోగం సాధించి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఉద్యోగాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయంలో అదనపు కలెక్టర్ పూజలు



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆలయ ప్రతినిధులు

హాలియా, మార్చి18(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా నిర్మించిన భక్తాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ పాల్గొన్నారు. పూజారులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కాకునూరి నారాయణగౌడ్, వ్యాపారవేత్త చిట్టిపోలు యాదగిరి, కుందూరు వెంకట్‌రెడ్డి, చెరుపల్లి ముత్యాలు, గౌని రాజారమేష్‌యాదవ్, పేలపూడి బాలకృష్ణ, యాద ఈదయ్య ఉన్నారు. హాలియా శివాలయానికి సంబంధించిన భూమి వ్యవహారంపై శివాలయం కమిటీ చైర్మన్ చెరుపల్లి ముత్యాలు అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.